TGTEL/25/A0827

# ప్రజా దివాస్

తెలుగు దినపత్రిక

prajadivvs57@gmail.com

## విలేఖరులు కావలెను

అసలైన అక్షర జ్ఞానాన్ని తెలియజేస్తూ... విలువలతో కూడిన జీవన శైలిలో ప్రేరణ కలిగించే విషయాలపై అవగాహన కలిగిస్తూ... ప్రజల సాధకబాధకాల్లో మమేకమై పరిష్కార మార్గాలపై ప్రేరణ కలిగించాలి అనుకుంటున్నారా..? బాధ్యతయుతమైన జర్నలిజంలో రాణించాలనుకుంటున్నారా ...? అయితే రండి ... అక్షరాన్ని అనుకున్న విధంగా రాద్దాం..

సెల్ : 9000281049

నియోజకవర్గ ఇంచార్జ్‌లు, జిల్లా స్టాఫర్‌లు మండల రిపోర్టల్‌లు కావలెను...

సంపుటి : 3 సంచిక : 258 | శుక్రవారం 11-09-2026 | ఎడిటర్: ఎస్ ఎన్ మౌనిక | పేజీలు : 8 వెల 3 /-

## 15వేల మంది పోలీసులు.. 500 సీసీటీవీలు.. బ్రిక్స్ సదస్సుకు భారీ భద్రత

బ్రిక్స్ సదస్సు కు దేశ రాజధాని దిల్లీ నగరం సిద్ధమైంది. ఈనెల 12, 13 తేదీల్లో ప్రగతి మైదాన్‌లోని భారత్ మండపంలో జరిగే బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సుకు ప్రపంచ దేశాల అగ్రనేతలు హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో దిల్లీ అధికారులు, పోలీసులు అప్రమత్తమయ్యారు.



మిగతాది 2లో

# బ్రిక్స్ సదస్సు: సస్పెన్స్‌కు తెర.. భారత్‌కు జిన్‌పింగ్!

### బ్రిక్స్ సదస్సుకు జిన్‌పింగ్ రాక ఖరారు

- ఈ నెల 12, 13న దిల్లీలో బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు
- జిన్‌పింగ్ రాకపై కొనసాగిన సస్పెన్స్‌కు తెర
- చైనా ప్రభుత్వ మీడియా జిన్హువా అధికారిక ప్రకటన
- సదస్సు సందర్భంగా మోదీ--జిన్‌పింగ్ భేటీకి అవకాశం
- భారత్--చైనా ద్వైపాక్షిక అంశాలపై చర్చలు జరిగే అవకాశం



మిగతాది 2లో

## ఆ వీడియోలను నమ్మి మోసపోవద్దు - ప్రియాంక కార్యాలయం హెచ్చరిక

- కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ వాద్రా పేరుతో సామాజిక మాధ్యమాల్లో నకిలీ వీడియోలు చక్కర్లు కొడుతున్నాయి.



మిగతాది 2లో

# బీఆర్ఎస్ కుట్రలను బలంగా తిప్పికొట్టాలి:

## సీఎల్పీ భేటీలో సీఎం రేవంత్

- ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- సభను అడ్డుకునేందుకు బీఆర్ఎస్ కుట్ర చేసిందని సీఎం ఆరోపణ
- పోలీసులు, ప్రజాప్రతినిధులను దూషించి సభకు ఆటంకం కలిగించారని విమర్శ
- స్పీకర్‌ను అభ్యంతరకరంగా దూషించారని రేవంత్ వ్యాఖ్య
- ఎమ్మెల్యేలు సభకు హాజరై చర్చల్లో పాల్గొనాలని సూచన

హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాలు, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యేలకు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. అసెంబ్లీ కమిటీ హాల్‌లో సీఎం అధ్యక్షతన సీఎల్పీ భేటీ జరిగింది. ఈ సమావేశంలో సీఎం పలు సూచనలు చేశారు. "వెయ్యి రోజుల పాలనను ప్రజలకు వివరించాలని అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తున్నాం. సభ జరగనివ్వకుండా ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ కుట్ర చేసింది. ఆ పార్టీకి అధికారం పోయినా అహంకారం పోలేదు. పోలీసులు, ప్రజాప్రతినిధులను దూషించి సభను సజావుగా జరగకుండా చేశారు. మహిళా అధికారుల ముందు టీషర్టులు విప్పి ఇబ్బంది కలిగించారు. స్పీకర్‌ను అత్యంత అభ్యంతరకరంగా దూషించారు. ప్రతిపక్షం కుట్రలను బలంగా తిప్పికొట్టాలి. ప్రభుత్వంపై జరిగిన కుట్రను ప్రజల్లోకి తీసుకెళ్లిన వారిని అభినందిస్తున్నా. ఎమ్మెల్యేలు సభకు హాజరై చర్చల్లో పాల్గొనాలి" అని రేవంత్ దిశానిర్దేశం చేశారు.

పేజి 2లో



## చెరువుల్లో నిమజ్జనాలకు మేం వ్యతిరేకం కాదు: హైడ్రా కమిషనర్ రంగనాథ్



మిగతాది 2లో

## త్వరలో ఆర్టీసీ కార్మిక సంఘాల ఎన్నికలు: మంత్రి పొన్నం



మిగతాది 2లో

## ఆ రెండు పార్టీలు అలజడి సృష్టిస్తున్నాయి:

### ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



హైదరాబాద్: బయట భారాస.. సభ లోపల భాజపా గందరగోళం సృష్టిస్తున్నాయని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ విమర్శించారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ.. రెండు పార్టీలు సభా సమయాన్ని వృథా చేస్తున్నాయని మండిపడ్డారు. "ప్రజా సమస్యలపై చర్చలు జరిపి పరిష్కారాలు కనుగొనాలని ప్రభుత్వం ప్రయత్నిస్తుంటే.. రెండు పార్టీలు కుయుక్తులు పన్ని సభలో అలజడి సృష్టిస్తున్నాయి. ఇప్పటికే 3 రోజులు వృథా.. ప్రజా సమస్యల కంటే ఫక్తు రాజకీయాలు చేసే యత్నం మాను కోవాలి.

పేజి 2లో

## ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం..

### 9 లక్షల ఎకరాల ఫ్రీహోల్డ్ భూముల రిజిస్ట్రేషన్లకు అనుమతి



మిగతాది 2లో

- 9 లక్షల ఎకరాల ఫ్రీహోల్డ్ భూముల రిజిస్ట్రేషన్లకు అవకాశం
- ఆక్రమాలపై 4 లక్షల ఎకరాల్లో విచారణ
- 28 లక్షల ఎకరాలు 22-ఏ నుంచి తొలగింపు
- భూముల తొలగింపుకు జీవో 444
- 22-ఏలో చేర్పులకు జీవో 445

# ఫైళ్లు పెండింగ్‌లో ఉంటే అభివృద్ధి, పాలన పెండింగ్‌లో ఉన్నట్టే:

- ఫైళ్లు పెండింగ్ = పాలన పెండింగ్
- కలెక్టర్లలో లీడర్‌షిప్ స్కిల్స్ పెంచాలి
- ప్రోయాక్టివ్ గవర్నెన్స్ అందించాలి
- జిల్లాల్లో 25 టాప్ ప్రాజెక్టులు చేపట్టాలి
- 2027 నాటికి భూ వివాదాలు లేని ఏపీ
- వృద్ధిని 15 శాతానికి పెంచే లక్ష్యం
- రివ్యూల నుంచి రిజల్ట్స్ వైపు మారాలి
- ఇగోలు పక్కనపెట్టి ప్రజాసేవ చేయాలి
- పోలవరం 2027 మార్చి నాటికి పూర్తి చేయాలి



అమరావతి: ఫైళ్లు పెండింగ్‌లో ఉంటే అభివృద్ధి, పాలన కూడా పెండింగ్‌లో ఉన్నట్టేనని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. పాలనకు కొత్త దిశ.. అధికార యంత్రాంగంలో లీడర్‌షిప్ స్కిల్స్‌పై అమరావతిలో జరుగుతున్న 8వ కలెక్టర్ల సదస్సులో సీఎం ప్రత్యేక దృష్టి పెట్టారు. అధికారులు, ఉద్యోగుల్లో నాయకత్వ పటిమ పెరిగితేనే ప్రజలకు పాలన మరింత వేగంగా, సమర్థంగా చేరుతుందని ప్రభుత్వం భావిస్తోంది. అందుకే కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో తొలిసారిగా లీడర్‌షిప్‌పై ప్రత్యేక సెషన్‌ను అజెండాలో చేర్చింది.



మిగతాది 2లో

## ఏపీలో మద్యం రవాణా కేసు.. వాసుదేవరెడ్డి, రాజ్‌కెసిరెడ్డిలకు చుక్కెదురు

- మద్యం రవాణా కేసులో నిందితులకు చుక్కెదురు
- వాసుదేవరెడ్డి, రాజ్ కెసిరెడ్డి ముందస్తు బెయిల్ పిటిషన్లు కొట్టివేత
- ఇరువురు ఇప్పటికే ఈడీ కస్టడీలో ఉన్నట్లు వెల్లడి
- కొత్త ఎఫ్ఐఆర్‌పై నిందితుల తరఫు న్యాయవాదుల అభ్యంతరం
- రెగ్యులర్ బెయిల్ కోసం సంబంధిత కోర్టును ఆశ్రయించాలి

TGTEL/25/A0827
ప్రజా దివాన్
తెలుగు దినపత్రిక
11-09-2026

# సంపాదకీయం

## వయోజనులు 103 కోట్లైతే, ఓటర్లు 88 కోట్లా?

అవునా?-- ఓటర్ జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియ దేశవ్యాప్తంగా అమలైనప్పుడు చట్టబద్ధమైన ఓటర్ల సంఖ్యకు సంభవించే మొత్తం నష్టానికి సంబంధించి మా తొలి అంచనాలపై చాలామంది ప్రతిస్పందన అది. ఒక సత్యాన్ని తెలుసుకున్నామన్న ఆశ్చర్యకరమైన భావన కొంతమంది స్పందనలో ధ్వనించగా మరి కొంతమంది ఆ ఏక పద ప్రశ్న రూప స్పందనలో మా అంచనాల పట్ల వ్యంగ్యాన్ని ధ్వనింపజేశారు. ఇదలా ఉంచి అసలు విషయానికి వద్దాం. బిహార్‌లో ఓటర్ జాబితాల నుంచి 65 లక్షల పేర్ల తొలగింపునకు సర్ దారితీసింది. ఆ ప్రకారం చూస్తే, దేశవ్యాప్తంగా దాదాపు పది కోట్ల మంది ఓటర్ల పేర్లను ఓటర్ జాబితాల నుంచి తొలగించేందుకు సర్ దారితీస్తుందని మేము అంచనా వేశాం. అయితే ఎవరూ మా మాటను విశ్వసించలేదు. అప్పటికీ మేము చేసిన హెచ్చరికల వల్లే బిహార్‌లో అంతిమ తొలగింపుల సంఖ్య చెప్పుకోదగిన స్థాయిలో తగ్గింది. సర్ అమలులో అసంగతాలపై మేము దేశ ప్రజలను అప్రమత్తం చేస్తూ వస్తున్నాము. ఇప్పుడు తుది గణాంకాలు వచ్చేశాయి. మొత్తం తొలగింపులు మేము ఊహించిన దానికంటే అత్యధికంగా ఉన్నాయి. దీనిపై మనం సత్వరమే మేల్కొనకపోతే మన ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతుంది.

ప్రధాన రాష్ట్రాలకు సంబంధించిన ముసాయిదా సర్ ఓటర్ జాబితాల విడుదలను భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) గతవారం పూర్తి చేసింది. నాగాలాండ్, త్రిపుర రాష్ట్రాల ముసాయిదా ఓటర్ జాబితాలను ఇంకా విడుదల చేయవలసి ఉన్నది. హిమాచల్ ప్రదేశ్, జమ్మూ--కశ్మీర్ రాష్ట్రాలలో సర్ ప్రక్రియ అమలు ఇంకా ప్రారంభం కాలేదు. అయినప్పటికీ దేశవ్యాప్త సర్ ఫలితాల ధోరణి స్పష్టంగా ఉంది. ముసాయిదా స్థాయిలో జరిగిన తొలగింపుల సంఖ్య 13 కోట్ల 37 లక్షలుగా ఉన్నది. ముసాయిదా జాబితాల విడుదల తరువాత మరికొంత మందిని జాబితాలలో చేర్చడం లేదా తొలగించడం సహజం కనుక సర్ అంతిమ జాబితాలలో తొలగింపుల సంఖ్య కొంచెం తక్కువగా ఉండవచ్చు. అదనపు చేర్పులు, సర్ ఇంకా ప్రారంభం కాని రాష్ట్రాలనూ పరిగణనలోకి తీసుకున్నప్పుడు భారత్ ఓటర్ జాబితాల నుంచి అంతిమ తొలగింపులు పన్నెండు కోట్లకు పైగా ఉండవచ్చునేది మా అంచనా.

ఈ విషయాన్ని మరింత లోతుగా, విశాలంగా చూద్దాం. 2024 లోక్‌సభ ఎన్నికల సమయంలో భారతదేశ ఓటర్ల సంఖ్య 98 కోట్లుగా ఉన్నది. అదే కాలంలో వయోజనుల సంఖ్య (99 కోట్లు)కు ఓటర్ల సంఖ్య ఇంచుమించు సమానంగా ఉన్నది. సర్ లాంఛనంగా ముగిసే నాటికి భారతదేశ వయోజన జనాభా అంచనా 103 కోట్లుగా ఉంటుంది, అంతిమ జాబితాలలోని ఓటర్ల సంఖ్య 88 కోట్లకు తగ్గిపోతుంది. వయోజన జనాభాకు, ఓటర్ల సంఖ్యకు మధ్య ఇంత పెద్ద వ్యత్యాసానికి కారణమేమిటో నిశితంగా చూడవలసిన అవసరమున్నది. ఆ భారీ వ్యత్యాసం రెండు అవకాశాలను సూచిస్తుంది: ఒకటి-- బహుశా జనాభా అంచనా భారీగా వేసి ఉండాలి. అంటే అధికారిక అంచనాలలో ఉన్నట్లుగా 145 కోట్లకు పైగా కాకుండా భారత జనాభా 125 కోట్ల లోపే ఉండి ఉండాలి. రెండు-- ఓటు వేసే వయసుగల 15 కోట్ల మంది యువత ఓటర్ జాబితాల నుంచి గల్లంతవడం. వీటిలో ఏది నిజం? ఏది నిజమైనప్పటికీ ఆ 'వాస్తవం' అక్షరాలా ఒక లజ్జాకర విషయమని చెప్పక తప్పదు.

సర్ ప్రక్రియలో తొలగింపులు అన్నీ తప్పుడువేనని భావించనవసరం లేదు. ప్రస్తుత ఓటర్ జాబితాలలో లొసుగులు, నకిలీ పేర్లు చాలా ఉన్నాయి. కనుక తొలగింపులలో అత్యధిక భాగం న్యాయబద్ధమైనవేనని అంగీకరించాలి. అయినప్పటికీ మూడోవంతు తొలగింపులు సక్రమమైనవి కాకపోయినా ఓటర్ జాబితాలు తారుమారు కావడమనేది ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాని స్థాయిలో జరిగిందనే వాస్తవాన్ని మనం గుర్తించాలి.

ఓటు హక్కు ఉన్నప్పటికీ వివిధ కారణాల వల్ల దాన్ని పూర్తిగా ఉపయోగించుకోలేనివారు, అసలు ఓటు హక్కు అందుబాటులోకి రానివారిని కూడా పరిగణనలోకి తీసుకోవల్సివుంది. సర్‌కు పూర్వపు జాబితాలలో లేని అర్హులైన ఓటర్లు కోట్ల సంఖ్యలో ఉన్నారు. వారిలో చాలామంది పేర్లను సర్ ప్రారంభం కాకముందే జాబితాల నుంచి తొలగించారు. ఈ అవకతవకలన్నిటినీ సర్ సరిదిద్దలేదు. దీన్నిబట్టి వయోజన జనాభా సంఖ్యకు, ఓటర్ల సంఖ్యకు మధ్య భారీ వ్యత్యాసం ఎందుకు ఉన్నదో అర్థమవుతుంది.

మరి ఆ వ్యత్యాసం సర్ తదుపరి దశలలో క్రమేణా తగ్గిందా? లేదు. లేకపోగా ప్రతి దశలోనూ ఓటర్ తొలగింపుల విస్తృతి, స్వభావం మరింత ప్రతికూల మార్పులకు లోనయ్యాయి. 'సర్'ను తొట్ట తొలుత బిహార్‌లో అమలుపరిచారు. అది తొలి మార్గదర్శక దశ. బిహార్‌కే పరిమితమైన ఆ దశలో ఓటర్ జాబితాల నుంచి తొలుత 65 లక్షల పేర్లను తొలగించారు. అయితే న్యాయవ్యవస్థ జోక్యంతో ఆ తొలగింపులు అంతిమంగా 45 లక్షలకు తగ్గిపోయాయి. బిహార్ తరువాత 13 రాష్ట్రాలలో సర్ రెండో దశ ప్రారంభమయ్యే నాటికే ఆ ప్రక్రియ పట్ల ప్రజలు ఉదాసీనత వహించారు. రాజకీయ పక్షాలు ఉపేక్షాభావం చూపాయి. అప్పటికే బిహార్ ఎన్నికలు జరిగిపోయినందున ప్రజలు 'సర్'కు అలవాటుపడ్డారు. ఓటర్ల సంఖ్యలో దాదాపు 13శాతం తగ్గుదలను చాలావరకు ఎవరూ ప్రశ్నించలేదు. అయితే పశ్చిమ బెంగాల్‌లో ముస్లిం ఓటర్ల తొలగింపు మీద మాత్రం జాతీయ స్థాయిలో పౌరసమాజం దృష్టి పెట్టింది. సర్ అమలు తీరుతెన్నులపై సంపూర్ణ నిర్ణయాధికారం ఎన్నికల సంఘానిదేనని సుప్రీంకోర్టు ఒక తీర్పులో స్పష్టం చేసింది. దీంతో ఎన్నికల సంఘం ఆ ప్రక్రియను తాను నిర్ణయించుకున్న రీతిలో అమలుపరిచింది. మూడో దశ ముసాయిదా సర్ జాబితాలలో ఓటర్ల తొలగింపులు 17శాతానికి పైగా పెరిగాయి!

సర్ మూడో దశ అమలైన హర్యానా, మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణతో పాటు ఢిల్లీలో ఓటర్ల తొలగింపులు అసాధారణంగా అత్యధిక సంఖ్యలో చోటుచేసుకున్నాయి. మూడు దశలలోను 'మృతుల' కేటగిరీలోని ఓటర్ల నిష్పత్తి స్థిరంగా ఉన్నది. మొత్తం తొలగింపులలో 'మృతుల' తొలగింపులు ఇంచుమించు 3శాతంగా ఉన్నాయి. ఇవి కాకుండా 'అందుబాటులో లేకపోవడం' (ఆబ్సెంట్), 'వలస వెళ్లడం' (షిఫ్టెడ్) కారణాలతో కూడా పెద్ద ఎత్తున ఓటర్లను తొలగిం చారు. గమనార్హమైన విషయమేమిటంటే ఆబ్సెంట్, షిఫ్టెడ్ కేటగిరీలను ఇప్పటివరకు స్పష్టంగా నిర్వచించలేదు. దీంతో స్థానిక ఎన్నికల అధికారులు తమకు తోచిన విధంగా ఆ కేటగిరీలను ఉపయోగించారు. ముసాయిదా ఓటర్ జాబితాల నుంచి తొలగింపునకు గురైనవారే కాకుండా అదనంగా మరో అయిదోవంతు మంది ఓటర్లు 'అన్ మ్యాప్డ్' (జాబితాలో చేర్చని) లేదా 'లాజికల్ డిస్క్రిపెన్సీ' (తార్కిక వ్యత్యాసం) కారణాల వల్ల మరింత పరిశీలనను ఎదుర్కోవలసి ఉంటుంది. ఒడిషా, జార్ఖండ్, తెలంగాణ రాష్ట్రాల్లో 'తార్కిక వ్యత్యాసం' నిష్పత్తి అసాధారణంగా హెచ్చుస్థాయిలో ఉన్నది. కారణమేమిటి? కంప్యూటర్ అల్గారిథమ్ కంటే మరేదో పెద్ద కారణం ఉందని చెప్పక తప్పదు. అటువంటి వ్యత్యాసాలను ఎలా పరిష్కరించాలనే దానికి సంబంధించి ఎలాంటి ప్రామాణిక కార్యాచరణ విధానం కూడా లేదు. నిష్కర్షగా చెప్పాలంటే 'లాజికల్ డిస్క్రిపెన్సీ' అనేది ఒక పద్ధతి కాదనేది స్పష్టం. ఉద్దేశపూర్వకంగా రూపొందించిన, అనుసరిస్తున్న ఒక ఏకపక్ష వైఖరి.సర్ మూడో దశలో ఒక కొత్త దురాచారం ఆరంభమయింది: చాలా రాష్ట్రాలలో సర్ ప్రక్రియ అధికారికంగా ప్రారంభం కాకముందే ఓటర్ జాబితాల నుంచి పెద్ద ఎత్తున తొలగింపులు జరిగాయి. వీరు మళ్లీ ఓటర్‌గా నమోదయ్యేందుకు వీలుగా కనీసం ఒక ఎన్యూమరేషన్ ఫామ్‌ను సైతం అందుకోలేదు. వారి తొలగింపులు చాలా అనామకంగా జరిగిపోయాయి. 'ఇవి సర్ తొలగింపుల కిందకు రావు' అనేది గమనార్హమైన వాస్తవం. సర్ మూడో దశకు షెడ్యూలు ప్రకటించిన మే 12, సర్ అధికారికంగా ప్రారంభమైన రోజుకు మధ్య 14 లక్షల మందికి పైగా ఓటర్ల పేర్లను ఓటర్ జాబితాల నుంచి తొలగించారు. వీటిలో అత్యధిక భాగం --8 లక్షలు-- మహారాష్ట్రలో జరిగాయి. 2025 ఫిబ్రవరిలో అసెంబ్లీ ఎన్నికల అనంతరం, 2026లో సర్ ప్రక్రియ అమలు ఆరంభం మధ్య కాలంలో ఢిల్లీలో ఓటర్ల సంఖ్య 11 లక్షలకు పైగా తగ్గిపోయింది. ఇదీ కారణం అని చెప్పేందుకు వీలుకాని పరిణామమిది. గత ఏడాది 1.56 కోట్లుగా ఉన్న ఢిల్లీ ఓటర్ల సంఖ్య సర్ ముసాయిదా ఓటర్ జాబితాల విడుదల నాటికి 98 లక్షలకు తగ్గిపోయింది.ఇవన్నీ స్పష్టం చేస్తున్నదేమిటి? సర్ డేటా అవకతవకలమయంగానూ, అసంబద్ధంగానూ ఉన్నది. డేటా క్రమరాహిత్యం, అసంగతాన్ని మాత్రమే మనం ఎదుర్కొనడం లేదు. సర్ రూపేణా ఎన్నికల ప్రజాస్వామ్య పునాదులనే పునర్నిర్మించేందుకు ప్రయత్నం జరుగుతోంది. ఇది ప్రజాస్వామ్య నైతికతకు విరుద్ధం. 'సర్' రూపకల్పన, అమలు, ఫలితాలతో సహా మొత్తం ప్రక్రియపై పూర్తి స్థాయి బహిరంగ తనిఖీ (పబ్లిక్ ఆడిట్) జరిగి తీరాలి. ఇది అత్యవసరం. ఇందుకు భారత ఎన్నికల సంఘంతో

## ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం..

మొదటిపేజీ తరువాయి
విజయవాడ: అమరావతిలో జరుగుతున్న కలెక్టర్ల సదస్సులో రెవెన్యూ సంస్కరణలపై మంత్రి అనగాని సత్యప్రసాద్ కీలక ప్రకటనలు చేశారు. నిబంధనల ప్రకారం ఉన్న 9 లక్షల ఎకరాల ఫ్రీహోల్డ్ భూముల రిజిస్ట్రేషన్లకు ఇవాళ్టి నుంచి అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. అక్రమాలు చోటుచేసుకున్న 4 లక్షల ఎకరాలపై సమగ్ర విచారణ చేపడుతున్నామని, గత ప్రభుత్వం 22-ఏలో చేర్చిన 28 లక్షల ఎకరాలను ఇప్పటికే నిషేధిత జాబితా నుంచి తొలగించామని చెప్పారు. 22-ఏ నుంచి భూముల తొలగింపును సులభతరం చేసేందుకు జీవో 444, కొత్తగా భూములను 22-ఏలో చేర్చే విధానాన్ని స్పష్టం చేస్తూ జీవో 445 జారీ చేశామని వివరించారు. భూమి హక్కులకు శాశ్వత పరిష్కారం చూపేందుకు 'మీ భూమి-బ్లాక్‌చెయిన్' టెక్నాలజీ ప్రాజెక్టును అమలు చేస్తున్నామని మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు.

## ఆ రెండు పార్టీలు అలజడి సృష్టిస్తున్నాయి:

మొదటిపేజీ తరువాయి
స్పీకర్‌పై జరిగిన అవమానంపై చర్చ జరపాలంటే బీఆర్ఎస్ చర్చించదు. 22ఏపై చర్చ జరపాలంటూ సభలో గందరగోళం సృష్టించేందుకు భాజపా యత్నిస్తోంది. ప్రతి ప్రజా సమస్యపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది" అని ఆది శ్రీనివాస్ తెలిపారు.

## చెరువుల్లో నిమజ్జనాలకు మేం వ్యతిరేకం కాదు: హైడ్రా కమిషనర్ రంగనాథ్

మొదటిపేజీ తరువాయి
హైదరాబాద్: నగరంలో గణేశ్ నిమజ్జనాలపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ కీలక వ్యాఖ్యలు చేశారు. చెరువుల్లో నిమజ్జనాలకు హైడ్రా వ్యతిరేకం కాదన్నారు. సోషల్ మీడియాలో హైడ్రా పై దుష్ప్రచారం చేస్తున్నారని చెప్పారు.

"కేంద్రం నోటిఫై చేసిన 4-5 చెరువుల్లోనే గణేశ్ నిమజ్జనంపై ఆంక్షలు ఉన్నాయి. అమీన్‌పూర్, కాప్రా చెరువుల్లో ఆంక్షలు విధించారు. దేశంలో ప్రప్రథమంగా అమీన్‌పూర్ చెరువును బయోడైవర్సిటీగా, నేచురల్ వెట్‌ల్యాండ్ కింద కాప్రా చెరువును కేంద్రం గుర్తించింది. హైడ్రా పునరుద్ధరిస్తున్న చెరువుల వద్ద ఎలాంటి ఆంక్షలు లేవు. మట్టి విగ్రహాలను పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుకుందాం. పీవోపీ విగ్రహాల నిమజ్జనం కోసం ప్రతి చెరువు వద్ద ప్రత్యేక స్థలం కేటాయిస్తున్నాం"అని రంగనాథ్ తెలిపారు.

## త్వరలో ఆర్టీసీ కార్మిక సంఘాల ఎన్నికలు: మంత్రి పొన్నం

మొదటిపేజీ తరువాయి
హైదరాబాద్: గత ప్రభుత్వం హయాంలో ఆర్టీసీ మూసివేసే పరిస్థితి ఉండగా.. ఇప్పుడిప్పుడే గాడిన పడుతోందని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. శాసనసభలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి పొన్నం సమాధానాలిచ్చారు. పీఎం ఈడ్రైవ్ కింద హైదరాబాద్ నగరానికి 2,200 బస్సులు రాబోతున్నాయని చెప్పారు. ఆర్టీసీలో కార్మిక సంఘాల ఎన్నికలను గత ప్రభుత్వం రద్దు చేసిందన్న మంత్రి.. త్వరలో ఎన్నికల తేదీపై నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. "కొత్త ఈవీ పాలసీ తీసుకొచ్చాం. హైదరాబాద్ నగరానికి 100 మినీ బస్సులు రాబోతున్నాయి. వాటిలో 50 పాతబస్తీకి, మరో 50 బస్సులు ఎంఎంటీఎస్, మెట్రోతో అనుసంధానిస్తాం. 347.47 కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణం పొందగలిగారు. ఇది ఒక చరిత్ర" అని పొన్నం ప్రభాకర్ తెలిపారు.

## ఏపీలో మద్యం రవాణా కేసు.. వాసుదేవరెడ్డి, రాజ్‌కెసిరెడ్డిలకు చుక్కెదురు

మొదటిపేజీ తరువాయి
దిల్లీ: వైకాపా హయాంలో జరిగిన మద్యం రవాణా కుంభకోణం కేసు లో నిందితులుగా ఉన్న ఏపీఎస్‌బీసీఎల్ మాజీ ఎండీ వాసుదేవరెడ్డి, రాజ్ కెసిరెడ్డిలకు సుప్రీంకోర్టు లో చుక్కెదురైంది. ఈ కేసులో ముందస్తు బెయిల్ కోసం దాఖలు చేసిన రెండు పిటిషన్లను సుప్రీంకోర్టు డిస్మిస్ చేసింది. నిందితులు ఇప్పటికే ఈడీ కస్టడీలో ఉన్నట్లు ఇరువురి తరఫు న్యాయవాదులు కోర్టుకు తెలిపారు. రవాణా కుంభకోణం అంటూ కొత్తగా ఎఫ్ఐఆర్ నమోదు చేశారని, కక్ష సాధింపునకు పాల్పడుతున్నారని నిందితుల తరఫు న్యాయవాదులు కోర్టులో వాదించారు. మొదట నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌పై జైలులో ఉన్నప్పుడు కస్టడీలోకి తీసుకోకుండా.. ఇప్పుడు మళ్లీ కొత్త ఎఫ్ఐఆర్ నమోదు చేసి కస్టడీకి తీసుకుంటున్నారని పేర్కొన్నారు. వాదనల అనంతరం.. రెగ్యులర్ బెయిల్ పిటిషన్ సంబంధిత కోర్టులో దాఖలు చేసుకోవాలని సూచిస్తూ సుప్రీంకోర్టు రెండు పిటిషన్లను డిస్మిస్ చేసింది.

## లంచ్‌కు ఆహ్వానించిన అమృతా ఫడణవీస్.. జరాంగే ఏమన్నారంటే!



మరాఠా రిజర్వేషన్ల కోసం పోరాడుతున్న మనోజ్ జరాంగే చేపట్టిన నిరవధిక నిరాహార దీక్ష 13వ రోజుకు చేరుకుంది. దీంతో ఆయన ఆరోగ్యం క్షీణిస్తున్నట్లు వైద్య నివేదికలు వెల్లడించాయి. ఈ క్రమంలో నాగ్‌పుర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ సతీమణి అమృతా ఫడణవీస్ మీడియాతో మాట్లాడుతూ.. మనోజ్ జరాంగేను సోదరుడిగా భావిస్తున్నానని, ఆయన్ను భోజనానికి తమ ఇంటికి రావాల్సిందిగా ఆహ్వానిస్తున్నానని అన్నారు.

సీఎం సతీమణి ఆహ్వానంపై జరాంగే స్పందించారు. ఆమె నివాసానికి వెళ్లేందుకు ఇది సరైన సమయం కాదన్నారు. ఓ సోదరిగా అభిమానంతో పిలిస్తే మాత్రం.. ఆమె ఆహ్వానాన్ని అంగీకరిస్తానని అన్నారు. అయితే, దీపావళి తర్వాత చేసుకునే 'భావ్‌బీజ్'కు తప్పకుండా వస్తానని అన్నారు. అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా మహారాష్ట్రలో ఈ పండగ చేసుకుంటారు. అయితే, రిజర్వేషన్ కోటా డిమాండ్లను నెరవేర్చేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు త్వరలో చలో ముంబయి కార్యక్రమాన్ని చేపట్టి తీరతామని జరాంగే స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించి సెప్టెంబర్ 12న కార్యాచరణ ప్రకటిస్తామని అన్నారు.

గతేడాది ఆగస్టు 29న ముంబయిలోని ఆజాద్ మైదానంలో జరాంగే ఐదు రోజుల నిరసన కార్యక్రమం చేపట్టిన విషయం తెలిసిందే. భారీగా ట్రాఫిక్ జామ్ కావడంతో స్పందించిన ప్రభుత్వం.. కొన్ని డిమాండ్లను అంగీకరించడంతో ఉద్యమ నేత ఆందోళనలను విరమించారు. మిగిలిన డిమాండ్లను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ జాల్నా జిల్లాలో గత నెల 29న జరాంగే మరోసారి నిరాహార దీక్ష చేపట్టారు. ఆరోగ్యం క్షీణిస్తుండడంతో పలువురు మంత్రులు ఫోన్‌లో మాట్లాడిన అనంతరం ఐవీ ఫ్లూయిడ్స్ తీసుకునేందుకు ఉద్యమ నేత అంగీకరించారు.

## బ్రిక్స్ సదస్సు: సస్పెన్స్‌కు తెర.. భారత్‌కు జిన్‌పింగ్!

మొదటిపేజీ తరువాయి
చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ భారత్ పర్యటన విషయంలో కొనసాగుతోన్న సస్పెన్స్‌కు తెరపడింది. బ్రిక్స్ సదస్సులో పాల్గొనేందుకు ఆయన భారత్‌కు రానున్నారు. ఈ విషయాన్ని చైనా ప్రభుత్వ రంగ మీడియా సంస్థ జిన్హువా వెల్లడించింది.

దేశ రాజధాని దిల్లీలోని భారత్ మండపంలో ఈ నెల 12, 13 తేదీల్లో బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు జరగనుంది . ఈ సదస్సుకు మిగతా సభ్య దేశాల అగ్రనేతలు హాజరవుతుండగా.. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ రాకపై మాత్రం తొలి నుంచి సందిగ్ధతే నెలకొన్న సంగతి తెలిసిందే. అయితే, తమకు కూడా ఎలాంటి అధికారిక సమాచారం లేదని అంతకుముందు చైనా విదేశాంగ శాఖ చెప్పడంతో.. అసలు జిన్‌పింగ్ బ్రిక్స్ సదస్సుకు వస్తారా? లేదా? అనే అంశంపై సందిగ్ధత నెలకొంది. చివరకు జిన్‌పింగ్ పర్యటనపై చైనా అధికారిక మీడియా నుంచి ప్రకటన వెలువడడం గమనార్హం.

భారత్-చైనా మధ్య దశాబ్దాలుగా సరిహద్దు విభేదాలు నెలకొన్నాయి. 1962లో యుద్ధం వీటికి నాంది పలికిందని చెప్పొచ్చు. 2020లో గల్వాన్ ఘర్షణతో అవి మరింత తీవ్రరూపం దాల్చాయి. అయితే ఈ మధ్యకాలంలో రెండు దేశాలు కాస్త పట్టువిడుపులు ప్రదర్శిస్తున్నట్లు కనిపిస్తోంది. గతేడాది షాంఘై సహకార సదస్సు (ఎస్‌సీఓ)కు ప్రధాని మోదీ హాజరైన సంగతి తెలిసిందే. ఇక ఈ బ్రిక్స్ సదస్సుకు ముందు మోదీ, జిన్‌పింగ్ ప్రత్యేకంగా భేటీ అయి ద్వైపాక్షిక చర్చలు జరిపే అవకాశం ఉన్నట్లు సమాచారం.

## 15వేల మంది పోలీసులు.. 500 సీసీటీవీలు.. బ్రిక్స్ సదస్సుకు భారీ భద్రత

మొదటిపేజీ తరువాయి
నగరంలో భారీగా భద్రతను పెంచారు. దాదాపు 15 వేల మంది పోలీసులను రంగంలోకి దించారు. 200 పారామిలటరీ కంపెనీలను మోహరించారు. విమానాశ్రయాలు, హోటళ్లు, భారత్ మండపం సహా కీలక ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. నేతలు బస చేసే పలు హోటళ్ల వద్ద ప్రత్యేక బలగాలను ఏర్పాటు చేశారు.

నగరంలోని కీలక ప్రాంతాల్లో నిఘా కోసం సుమారు 500 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు వెల్లడించారు. అనుమానాస్పద కదలికలను గుర్తించేందుకు ఆధునిక నిఘా వ్యవస్థలను వినియోగిస్తున్నట్లు పేర్కొన్నారు. వైమానిక ముప్పును ఎదుర్కొనేందుకు యాంటీ డ్రోన్ వ్యవస్థలను సిద్ధం చేసినట్లు వెల్లడించారు. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ (శఱ జీఱఅజూఱఅస్త్ర), రష్యా అధ్యక్షుడు పుతిన్ (ఎశ్రీ౹ఎఱఎఱతీ ూబఱఅ) సహా పలువురు దేశాధినేతలు ఈ సదస్సుకు హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా భారీ భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. వీఐపీ కాన్వాయ్‌ల రాకపోకల కోసం అధికారులు ప్రత్యేక మార్గాలను ఖరారు చేశారు.

## ఆ వీడియోలను నమ్మి మోసపోవద్దు - ప్రియాంక కార్యాలయం హెచ్చరిక

మొదటిపేజీ తరువాయి
కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ వాద్రా పేరుతో సామాజిక మాధ్యమాల్లో నకిలీ వీడియోలు చక్కర్లు కొడుతున్నాయి. కృత్రిమ మేధ సాయంతో ఆమె ఫొటోలు, వాయిస్‌ను ఉపయోగించి ఈ వీడియోలు రూపొందించారు. పలు సంస్థల్లో పెట్టుబడులు పెట్టాలంటూ ప్రియంకా స్వయంగా చెబుతున్నట్లు ఆ వీడియోల్లో ఉంది. ఈ నకిలీ వీడియోలపై ఆమె కార్యాలయం స్పందించింది. వాటిని నమ్మి మోసపోవద్దని ప్రజలకు సూచించింది. ఏఐతో రూపొందించిన ఆ వీడియోలు మోసపూరితమైనవని స్పష్టం చేసింది. వాటిలోని లింకులపై క్లిక్ చేయొద్దని, ఎలాంటి పెట్టుబడులు పెట్టొద్దని సూచించింది. ఇలాంటి పోస్టులు కనిపిస్తే వెంటనే ఫిర్యాదు చేసి.. బ్లాక్ చేయాలని కోరింది.

## ఫైళ్లు పెండింగ్‌లో ఉంటే అభివృద్ధి, పాలన పెండింగ్‌లో ఉన్నట్టే: చంద్రబాబు

మొదటిపేజీ తరువాయి



వినూత్న ఆలోచనలు, ఆవిష్కరణలు, బెస్ట్ ప్రాక్టీసెస్‌ను క్షేత్రస్థాయిలో అమలుచేయడంలో నాయకత్వమే కీలకమని సీఎం చంద్రబాబు స్పష్టంచేశారు.గత ప్రభుత్వ మద్యం విధానం అక్రమాలను కలెక్టర్ల సదస్సులో సీఎం లేవనెత్తారు. గత ప్రభుత్వం మార్కెట్‌లోకి తెచ్చిన జే బ్రాండ్ కల్తీ మద్యం వల్ల 30 వేల మంది ప్రాణాలు కోల్పోయారని, వేలాది మంది ఆరోగ్యం దెబ్బతిందని ఆరోపించారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడిన ఆ కల్తీ మద్యం బ్రాండ్లన్నింటినీ రద్దు చేసి.. ఇప్పుడు పారదర్శకంగా, నాణ్యమైన మద్యం విక్రయాలు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని స్పష్టంచేశారు. ప్రతి శాఖలో సంస్కరణలు తీసుకొచ్చామని, ఆర్థిక ప్రగతిని ప్రతి నెలా పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. 2022-23ను బేస్ ఇయర్‌గా తీసుకుంటే ప్రస్తుత ధరల ప్రకారం 13.44 శాతం వృద్ధి నమోదైందని, జీఎస్టీ వసూళ్లు గతేడాదితో పోలిస్తే రూ.25,450 కోట్లు పెరిగాయని వెల్లడించారు. వనరులు, టెక్నాలజీ ఉన్నా కొన్ని చోట్ల లోపం ఉందన్న సీఎం.. రియాక్టివ్ గవర్నెన్స్‌కు స్వస్తి చెప్పి ప్రోయాక్టివ్ గవర్నెన్స్ అందించాలని అధికారులను ఆదేశించారు.

### ఫేక్ ప్రచారాలకు వేగంగా కౌంటర్ ఇవ్వాలి..

ఫేక్ ప్రచారాలతో ప్రజలను తప్పుదోవ పట్టించే రాజకీయ కుట్రలకు అధికారులు వేగంగా కౌంటర్ ఇవ్వాలని సీఎం స్పష్టం చేశారు. డీఎస్సీ నియామకాల్లో ఎలాంటి తప్పు జరగలేదని, స్పోర్ట్స్ కోటాలో నిబంధనల ప్రకారమే ఉద్యోగాలు ఇచ్చామని తేల్చిచెప్పారు. దుష్ప్రచారాన్ని తిప్పికొట్టిన ఇద్దరు మహిళా అధికారులను అభినందించిన సీఎం.. సరైన సమయంలో స్పందించకపోతే ఆ నష్టం ప్రభుత్వానికే చుట్టుకుంటుందని హెచ్చరించారు. సమీక్షలకే పరిమితం కాకుండా ఫలితాలపై దృష్టి పెట్టాలని, ప్రతి జిల్లాలో 25 టాప్ ప్రాజెక్టులు, ప్రతి నియోజకవర్గంలో 10-15 ప్రాధాన్య ప్రాజెక్టులను గుర్తించి అభివృద్ధి చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. తాగునీటి సరఫరాలో ఎలాంటి రాజీ ఉండదని, సంక్షోభ సమయంలో కలెక్టర్ల నాయకత్వ సామర్థ్యం బయటపడాలని స్పష్టం చేశారు. 2027 నాటికి భూ వివాదాలు లేని రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దాలని, జిల్లాలను గ్రోత్ ఇంజిన్లుగా మార్చి ఆదాయం, సంపద పెంచేలా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. ప్రస్తుతం 13.44 శాతంగా ఉన్న వృద్ధిని 15 శాతానికి తీసుకెళ్లే లక్ష్యంతో బెస్ట్ ప్రాక్టీసెస్, కొత్త ఆలోచనలు, వేగవంతమైన పాలనతో ముందుకెళ్లాలని సూచించారు. రివ్యూల నుంచి రిజల్ట్స్ వైపు మారి.. వన్ స్టేట్- వన్ మిషన్- వన్ ఎయిమ్.. అనేదే స్వర్ణాంధ్రప్రదేశ్ లక్ష్యమని చంద్రబాబు తేల్చి చెప్పారు.

### ఇగోలు పక్కన పెట్టండి..

ఇగోలు పక్కనపెట్టి ప్రజా సేవకులుగా పనిచేద్దామంటూ అధికారులకు ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. 27 నెలల్లో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టి, సంక్షేమానికి రూ.1.40 లక్షల కోట్లు, అభివృద్ధికి రూ.1.50 లక్షల కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. హంద్రీనీవా, వెలిగొండ ఫేజ్-1, పోలవరం ఎడమ కాలువ, భోగాపురం విమానాశ్రయం వంటి కీలక ప్రాజెక్టులు పూర్తి చేశామని, పోలవరాన్ని 2027 మార్చి నాటికి పూర్తి చేస్తామని వెల్లడించారు. నీటి భద్రత, సాగునీటి రంగంలో చేస్తున్న కృషికి 'వాటర్‌మ్యాన్'గా గుర్తింపు రావడం సంతోషంగా ఉందన్న సీఎం.. రాష్ట్ర ప్రగతి వెనుక మంత్రులు, అధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధుల సమష్టి కృషి ఉందని స్పష్టం చేశారు.

# జగిత్యాల జిల్లాలో ఘోరం: కొడుకుతో కలిసి తల్లి ఆత్మహత్య

**- బావిలో దూకిన మహిళ మృతదేహం లభ్యం.. చిన్నారి కోసం ముమ్మర గాలింపు**



మల్యాల మండలం / సెప్టెంబర్ 10 ప్రజాదివాస్

జగిత్యాల జిల్లా మల్యాల మండలంలో విషాదఛాయలు అలముకున్నాయి. కుటుంబంలో తలెత్తిన మనస్పర్థల కారణంగానో, ఇతర సమస్యల వల్లనో ఒక మహిళ తన చిన్న కుమారుడితో కలిసి వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. మల్యాల మండలం ముత్యంపేట శివారులోని వ్యవసాయ బావిలో ఈ దారుణ సంఘటన చోటుచేసుకుంది. మల్యాల గ్రామానికి చెందిన గుండేటి కవిత (36) తన భర్త దశరథం, ఇద్దరు కుమారులతో కలిసి జీవిస్తోంది. గురువారం రోజున కవిత తన చిన్న కుమారుడు శశాంక్ తో కలిసి ఇంట్లో నుండి బయటకు వెళ్లింది. ముత్యంపేట మరియు గుడిపేట శివారు ప్రాంతంలోని ఒక వ్యవసాయ బావి వద్దకు చేరుకున్న ఆమె, ఆత్మహత్య చేసుకునేముందు తన సోదరుడు కొమురయ్యకు ఫోన్ చేసి "అన్నా.. నేను చనిపోతున్నా" అని తెలిపినట్లు సమాచారం. ఆందోళన చెందిన కుటుంబసభ్యులు హుటాహుటిన అక్కడకు చేరుకునే సరికే బావి ఒడ్డున చెప్పులు, సెల్‌ఫోన్ మాత్రమే కనిపించాయి. వెంటనే సమాచారం అందుకున్న ఎస్ఐ సందీప్ తమ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల సాయంతో బావిలో గాలింపు చర్యలు చేపట్టారు. గాలింపులో కవిత మృతదేహం లభ్యమవ్వగా, కుమారుడు శశాంక్ ఆచూకీ ఇంకా లభించలేదు. పోలీసులు శశాంక్ కోసం బావిలో నీటిని తోడుతూ ముమ్మరంగా గాలిస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. తల్లి, కుమారుడు దారుణానికి ఒడిగట్టడంతో మల్యాలలో తీవ్ర విషాదం నెలకుంది.

# విద్యార్థుల్లో పర్యావరణ చైతన్యం పెంపొందించే దిశగా వన మహోత్సవం అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా మొక్కల నాటకం



వేములవాడ / సెప్టెంబర్ 10 ప్రజాదివాస్

రాజన్న సిరిసిల్ల జిల్లా అగ్రహారంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో వన మహోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి. శంకర్ అధ్యాపకులు, విద్యార్థులతో కలిసి కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, విద్యార్థులు విరివిగా మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతను కూడా తీసుకోవాలని సూచించారు. కళాశాల ఆవరణను మరింత పచ్చదనంతో, ఆహ్లాదకర వాతావరణంతో తీర్చిదిద్దేందుకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు కళాశాల ప్రాంగణంలో గన్నేరు, మందార, దేవకాంచనం, క్రోటన్ జాతులకు చెందిన పూల మొక్కలను పెద్ద ఎత్తున నాటారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు శ్రీమతి మార్కొండ శకుంతల, డా. కె. శారద, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డా. ఎం. శోభారాణి, డా. ఎ. ప్రసాద్, డా. ఎస్. కృష్ణప్రసాద్, జి. శ్రీధర్‌రావు, జె. నర్సయ్య, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

# ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లకు పకడ్బందీ ఏర్పాట్లు

**- 2.40 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలు లక్ష్యం - జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్**

**- అక్టోబర్ చివరి వారం నుంచి వరి కొనుగోళ్లు ప్రారంభం**

రాజన్న సిరిసిల్ల జిల్లా / సెప్టెంబర్ 10 ప్రజాదివాస్

ఖరీఫ్ సీజన్ 2026-27 వరి ధాన్యం కొనుగోళ్లను ప్రణాళిక ప్రకారం విజయవంతంగా పూర్తి చేసేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన ఏర్పాట్లపై గురువారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ పాల్గొన్నారు. వ్యవసాయ శాఖ అంచనాల ప్రకారం జిల్లాలో ఈ ఖరీఫ్ సీజన్‌లో సుమారు 2.40 లక్షల మెట్రిక్ టన్నుల సన్న, దొడ్డు రకం ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు కలెక్టర్ తెలిపారు. ఇందుకోసం ఐకేపీ ఆధ్వర్యంలో 136, పీఏసీఎస్ ద్వారా 96, డీసీఎంఎస్ ద్వారా 1, మెప్మా ఆధ్వర్యంలో 7 కేంద్రాలతో కలిపి మొత్తం 236 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. అక్టోబర్ చివరి వారం నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వరి దిగుబడులు చేరే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్న నేపథ్యంలో అన్ని సన్నాహక చర్యలను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. రవాణా కాంట్రాక్టర్లు ఒప్పందాల ప్రకారం వాహనాలను అందుబాటులో ఉంచాలని, ప్రతి వాహనానికి జీపీఎస్ పరికరాలు ఏర్పాటు చేయాలని రవాణా శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లాలో ప్రస్తుతం 10,83,500 కొత్త గన్నీ సంచులు, 2,60,000 పాత గన్నీ సంచులు అందుబాటులో ఉన్నాయని, అవసరాలకు అనుగుణంగా అదనపు సంచులను సమకూర్చాలని సూచించారు. అలాగే 4,335 టార్పాలిన్లు, 333 తేమ యంత్రాలు, 630 ఎలక్ట్రానిక్ వేయింగ్ యంత్రాలు, 270 గ్రెన్ కాలిపర్స్, 270 హస్క్ రిమూవర్లు, 2 ఆటోమేటిక్ ప్యాడీ క్లీనర్లు, 2 డ్రైయర్లు సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు శ్రీధర్ బాబు, కేఎస్‌బీ కుమారి, డీసీఎస్ఓ బుచ్చిబాబు, డీఎం గోపాల్, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, జిల్లా సహకార శాఖ అధికారి రామకృష్ణ, వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ప్రకాశ్, మార్క్‌ఫెడ్ అధికారి హబీబ్ తదితరులు పాల్గొన్నారు.



# మండల సర్వసభ్య సమావేశం

ముస్తాబాద్/ సెప్టెంబర్10 ప్రజా దివాస్



రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల అభివృద్ధి అధికారి లచ్చాలు ఆధ్వర్యంలో గ్రామాల అభివృద్ధి పై అన్ని గ్రామాల సర్పంచులు వివిధ శాఖల అధికారులతో సర్వసభ్య సమావేశం నిర్వహించడం జరిగింది . ఈ సమావేశంలో పలు గ్రామాల సర్పంచులు రైతులకు నాణ్యమైన కరెంటును సరఫరా చేయాలని కరెంటు సక్రమంగా రాకపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కరెంటు ఎప్పుడు వస్తుందో పోతుందో తెలియని పరిస్థితి నెలకొన్నది సంబంధిత అధికారులు స్పందించి రైతులకు నాణ్యమైన కరెంటు అందించాలని పలువురు గ్రామ సర్పంచులు అధికారులకు విన్నవించారు అదేవిధంగా మన గ్రామాల సర్పంచులు గ్రామాలలో ఉన్న సమస్యల పైన అధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగింది ఈ కార్యక్రమంలో మండల డిప్యూటీ తహసిల్దార్ అపర్ణ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి రాణి సెస్ డైరెక్టర్ చందుపట్ల అంజిరెడ్డి ఆత్మ కమిటీ చైర్మన్ కొండము రాజు రెడ్డి పలు గ్రామాల సర్పంచులు పంచాయతీ కార్యదర్శులు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు

# ప్రారంభానికి సిద్ధమవుతున్న 10 హెల్త్ సబ్ సెంటర్లు
# తుది దశలో హెల్త్ సబ్ సెంటర్లు.. పురోగతిపై కలెక్టర్ సమీక్ష

**- ప్రజారోగ్యానికి కొత్త ఊపు.. హెల్త్ సబ్ సెంటర్ల పనులు వేగవంతం అన్ని మౌలిక వసతులు కల్పించి త్వరగా వినియోగంలోకి తేవాలి**

**- హెల్త్ సబ్ సెంటర్ల నిర్మాణాలపై జిల్లా స్థాయి సమీక్ష సమావేశం**



రాజన్న సిరిసిల్ల జిల్లా / సెప్టెంబర్ 10 ప్రజాదివాస్

జిల్లాలో పంచాయతీరాజ్ శాఖ, టీజీఎంఎస్ ఐడీసీ ఆధ్వర్యంలో నిర్మాణంలో ఉన్న హెల్త్ సబ్ సెంటర్ల భవనాల పనులను వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో గురువారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె హెల్త్ సబ్ సెంటర్ల నిర్మాణాల పురోగతిపై సంబంధిత శాఖల అధికారులతో చర్చించారు. ఎన్‌హెచ్ఎం, 15వ ఆర్థిక సంఘం నిధులు మరియు ఇతర నిధులతో జిల్లాలో చేపడుతున్న హెల్త్ సబ్ సెంటర్ల నిర్మాణాల స్థితిగతులను అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఎన్‌హెచ్ఎం నిధులతో నిర్మిస్తున్న 9 హెల్త్ సబ్ సెంటర్లు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయని, 15వ ఆర్థిక సంఘం నిధులతో నిర్మించిన మరో సబ్ సెంటర్ కూడా ప్రారంభానికి సిద్ధంగా ఉందని తెలిపారు. అదేవిధంగా మరో ఆరు భవనాల నిర్మాణ పనులు తుది దశలో కొనసాగుతున్నాయని వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ, తుది దశలో ఉన్న నిర్మాణాలను ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలని సూచించారు. ప్రతి హెల్త్ సబ్ సెంటర్‌లో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు వంటి మౌలిక సదుపాయాలను కల్పించి ప్రారంభానికి సిద్ధం చేయాలని ఆదేశించారు. పనుల పురోగతిని సంబంధిత శాఖల అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ గడువులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో పంచాయతీరాజ్ శాఖ ఈఈ సుదర్శన్ రెడ్డి, టీజీఎంఎస్ ఐడీసీ ఈఈ విశ్వప్రసాద్, జిల్లా వైద్యాధికారి ఏంజెలా ఆల్ఫ్రెడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ సింగర్‌గా గుగ్గిళ్ల శ్రీనిక గౌడ్

**- తెలంగాణ యాస, భాష పాటల పోటీలో అదరగొట్టిన ఆరో తరగతి విద్యార్థిని**

తంగళ్లపల్లి మండలం / సెప్టెంబర్ 10, ప్రజాదివాస్




తెలంగాణ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం తంగళ్లపల్లి మండలం మండేపల్లి ఆదర్శ పాఠశాలలో వివిధ సాంస్కృతిక విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా తెలంగాణ యాస, భాషపై నిర్వహించిన పాటల పోటీల్లో ఆరో తరగతి విద్యార్థిని గుగ్గిళ్ల శ్రీనిక గౌడ్ తన ప్రతిభను చాటుకుని పాఠశాల స్థాయిలో ఉత్తమ సింగర్‌గా ఎంపికైంది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు విఠల్, ఉపాధ్యాయులు శ్రీనికను అభినందించి మెమెంటో అందజేశారు. అలాగే మండేపల్లి సర్పంచ్ గాదగోని సాగర్, ఇందిరమ్మ కాలనీ సర్పంచ్ గడ్డం రచన మధుకర్, సారంపల్లి గ్రామ సర్పంచ్ గుగ్గిళ్ల లావణ్య నరసయ్య శ్రీనికను ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదిగి గొప్ప సింగర్‌గా పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు.

# చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమం

ముస్తాబాద్/ సెప్టెంబర్ 10 ప్రజా దివాస్



రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రంలో రజక సంఘం మండల అధ్యక్షులు సుద్దాల దేవయ్య ఆధ్వర్యంలో సాకలి ఐలమ్మ 41వ వర్ధంతి వేడుకలను విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి సాకలి ఐలమ్మ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆనాడు సాకలి ఐలమ్మ బడుగు బలహీన వర్గాల కోసం తన జీవితాన్ని త్యాగం చేసి పెత్తందారులపై పోరాటం చేసిన వీర వనిత అని కొనియాడారు ఈ కార్యక్రమంలో రజక సంఘం రాష్ట్ర అధ్యక్షులు అక్క రాజు శ్రీనివాస్ ముస్తాబాద్ గ్రామ సర్పంచ్ రెడ్డి మట్ట వెంకటేశ్వర్ రెడ్డి సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి సిఐటియు రాష్ట్ర సమితి సభ్యులు గీసా బిక్షపతి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గజ్జల రాజు జిల్లా నాయకులు ఏళ్ల బాల్రెడ్డి బిజెపి మండల అధ్యక్షుడు క్రాంతి కుమార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అరుట్ల మహేష్ దిటి నరసింహులు భాను నరేష్ ఈస శంకర్ శీలం స్వామి మనోహర్ కోడె శ్రీనివాస్ హనుమయ్య తదితరులు పాల్గొన్నారు

# సమయానికి కరెంటు ఇవ్వండి సార్: రైతుల ఆవేదన

- ప్రధాన రహదారిపై ధర్నా



ప్రజా దివాన్: గంభీరావుపేట
మండలంలో సరైన సమయానికి కరెంటు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గంభీరావుపేట మండలం మల్లారెడ్డిపేట గ్రామానికి చెందిన రైతులు లింగన్నపేట గ్రామంలోని ప్రధాన రహదారిపై బైఠాయించి గురువారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. సమయానికి కరెంటు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక రోజులు సుమారు 50 సార్లు కరెంటు ట్రిప్ అవుతుందని లబోదిబోమంటున్నారు. లో వోల్టేజ్ కరెంటు సరఫరా కావడంతో పంట పొలంలోని స్టార్టర్లు, మోటర్లు తరచు కరబోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. తమ బాధను అధికారులు పట్టించుకోవడంలేదని ఆరోపించారు. ఇప్పటికైనా పై అధికారులు స్పందించి సరైన సమయానికి 24 గంటలు త్రీఫేస్ కరెంటు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలు మల్లారెడ్డిపేట గ్రామానికి చెందిన రైతులు పాల్గొన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డి నిరుద్యోగులను మోసం చేశారు

అక్రమ అరెస్టులను ఖండించిన బిఆర్ఎస్వి

ప్రజా దివాన్: గంభీరావుపేట



సీఎం రేవంత్ రెడ్డి నిరుద్యోగులకు రెండు లక్షల ఉద్యోగాలు నోటిఫికేషన్ ఇస్తామని చెప్పి మోసం చేశారని గంభీరావుపేట బి ఆర్ ఎస్ వి నాయకులు విమర్శించారు. మండల కేంద్రంలో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగ జేఏసీ ధర్నాకు పిలుపునివ్వగా.. బి ఆర్ ఎస్ వి నాయకులు మద్దతుగా నిలిచినందుకు పోలీసులు ముందస్తు అరెస్టు చేశారని మండిపడ్డారు. అక్రమ అరెస్టులను తీవ్రంగా ఖండించారు. సీఎం రేవంత్ రెడ్డి నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వకుండా, నిరుద్యోగ భృతి ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరుద్యోగులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. లేనియెడల రాబోయే రోజుల్లో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో మండల యూత్ నాయకులు రత్నాకర్, బిక్షపతి, సందీప్, అర్జున్, కళ్యాణ్, అజ్మత్, కిషోర్, దోసల శంకర్, రవి, ముస్తఫాలు పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 17ను తెలంగాణ దినోత్సవం గా నిర్వహించాలి

బిజెపి నిరసన

ప్రజా దివాన్: గంభీరావుపేట



సెప్టెంబర్ 17 ను తెలంగాణ విమోచన దినోత్సవం గా నిర్వహించాలని బిజెపి మండల అధ్యక్షులు కోడె రమేష్ డిమాండ్ చేశారు. గంభీరావుపేట మండల కేంద్రంలో గురువారం తహసిల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం తహసిల్దార్ కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజలు నిజం నిరంకుశ పాలన నుండి, రజాకార్ల ధమన కాండను ఎదురించి సాధించిన విమోచనం వేలాదిమంది ప్రజల త్యాగాలకు స్ఫూర్తిదాయకమని అన్నారు. ప్రజల పోరాట స్ఫూర్తిని గుర్తు చేస్తు అధికారికంగా తెలంగాణ దినోత్సవం గా నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి దేవసాని కృష్ణ,ధార్మిక సెల్లు జిల్లా అధ్యక్షులు డాక్టర్ సత్యనారాయణ, జిల్లా మహిళా మోర్చా కార్యదర్శి జమున, ఉపాధ్యక్షులు యలేందర్, నర్సింలు, కార్యదర్శి రాజు, నాయకులు సర్వోత్తమ్, శ్రీనివాస్, దేవా గౌడ్, సత్యనారాయణ, రవీందర్, నర్సింలు, శ్రీనివాస్ గౌడ్, తిరుపతి, మహేష్, దేవేందర్ యాదవ్,దేవేందర్ నాయక్, చంద్రం యాదవ్, రాజేష్, నవీన్, దేవయ్య నాయకులు పాల్గొన్నారు.

# తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి

- భారతీయ జనతా పార్టీ డిమాండ్

ముస్తాబాద్ / సెప్టెంబర్ 10 ప్రజా దివాన్
సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా పార్టీ ముస్తాబాద్ మండల అధ్యక్షులు సొల్ల క్రాంతికుమార్ ఆధ్వర్యంలో గురువారం తహసిల్దార్ వినతిపత్రంసమర్పించారుఈ సందర్భంగా బిజెపి మండల నాయకులు మాట్లాడుతూ నిజాం రజాకార్ల నిరంకుశ పాలన నుండి తెలంగాణ ప్రాంతానికి విముక్తి లభించిన రోజు సెప్టెంబర్ 17 అని గుర్తు చేశారు. అమరుల త్యాగాలను స్మరించుకుంటూ ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు,కళాశాలల్లో జాతీయ జెండాను అధికారికంగా ఎగురవేసి తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని వారు విజ్ఞప్తి చేశారు.

ప్రధాన డిమాండ్లు:
మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సెప్టెంబర్ 17న మువ్వన్నెల జెండా ఆవిష్కరణ విమోచన పోరాట అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ అధికారిక కార్యక్రమాలు చేపట్టడం.యువతకు తెలంగాణ విమోచన చరిత్రను తెలియజేసే విధంగా విద్యాసంస్థల్లో ప్రత్యేక కార్యక్రమాలు.ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి ఎదునూరి గోపికృష్ణ,జిల్లా కార్యదర్శి మీసా సంజీవ్,జిల్లా కౌన్సిల్ మెంబర్ మెరుగు అంజాగౌడ్,ఆవునూర్ సర్పంచ్ నక్కదాసరి



రవీందర్ ఉప సర్పంచ్ లు కోలా కృష్ణ,దగ్గు నవీన్ ఉపాధ్యక్షులు తిరుపతి చికోటి మహేష్,కాసోడి రమేష్,చిట్టినేని శ్రీనివాస్ రావు, కుడుకల జనార్ధన్ మహేష్,శక్తి కేంద్ర ఇంచార్జి లు గూడా బాల్ రెడ్డి,కట్కం మహేష్,మీస స్వామి కాసరవు రవి,మామిండ్ల బిక్షపతి,హోర్షవర్ధన్,యాదగిరి,శ్యామ్, ప్రణవ్,సాయి బీజేపీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు

# వీరవనిత చాకలి ఐలమ్మకు ఘన నివాళులు

- ఐలమ్మ పోరాట స్ఫూర్తి తరతరాలకు మార్గదర్శకం: పొలాస నరేందర్
- వేములవాడ తెలంగాణ చౌక్‌లో చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలు





వేములవాడ / సెప్టెంబర్ 10 ప్రజాదివాన్
బీసీ సాధికారిత సంఘం ఆధ్వర్యంలో వీరవనిత చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా తెలంగాణ చౌక్‌లోని ఆమె విగ్రహానికి బీసీ నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా బీసీ సాధికారిత సంఘం ఉత్తర తెలంగాణ జిల్లాల ఇంచార్జీ పొలాస నరేందర్ మాట్లాడుతూ... తెలంగాణ సాయుధ పోరాటంలో భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరీ విముక్తి కోసం పోరాడిన నిప్పుకనిక చాకలి ఐలమ్మ అని కొనియాడారు. 1895 సెప్టెంబర్ 26న జనగామ తాలూకా కిష్టాపూర్ గ్రామంలో జన్మించిన ఐలమ్మ, నాటి నిజాం పాలనలో దొరలు, దేశ్‌ముఖ్‌ల నిరంకుశత్వాన్ని ఎదిరించి అణగారిన వర్గాలకు అండగా నిలిచారని గుర్తుచేశారు. ఐలమ్మను భయపెట్టేందుకు ఆమె భర్త, కుమారులను జైలుకు పంపి, ఆస్తి నష్టం కలిగించినప్పటికీ కొంగు నడుముకు చుట్టి ధైర్యంగా పోరాటం సాగించారని తెలిపారు. ఆమె అందించిన స్ఫూర్తితో సాగిన సాయుధ పోరాటంలో 3,000 గ్రామాలు నిజాం నిరంకుశత్వం నుంచి విముక్తి పొంది, 10 లక్షల ఎకరాల భూమి పేదలకు దక్కిందని పేర్కొన్నారు. 1985 సెప్టెంబర్ 10న ఆమె కన్నుమూసినా ఆమె ఆశయాలు నిరంతరం మార్గదర్శకంగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సాధికారిత సంఘం నేతలు లింగంపల్లి దేవయ్య, కనపర్తి సుధాకర్, పిన్నింటి హన్మాండ్లు, వాసం శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# వాతావరణ మార్పులపై రైతులకు అవగాహన

- వరి, పత్తి పంటల్లో యాజమాన్య పద్ధతులపై సూచనలు
- యూరియా సక్రమ వినియోగం.. నానో యూరియాతో ప్రయోజనాలు
- వ్యవసాయ యాంత్రీకరణతో కూలీల కొరతకు చెక్ ,సబ్సిడీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

వేములవాడ / సెప్టెంబర్ 10 ప్రజాదివాన్
వేములవాడలో బుధవారం ఆత్మ ([illegible]) ఆధ్వర్యంలో రైతు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, ఏఎంసీ చైర్మన్ రాజు, ఆత్మ కమిటీ వేములవాడ చైర్మన్ ముఖుందర్ రెడ్డి హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో టీఆర్వీకే జిల్లా కోఆర్డినేటర్ సాయి కుమార్, ఎంఏఓ సాయి కిరణ్, వెటర్నరీ డాక్టర్ రామకృష్ణ, రైతు సంఘం అధ్యక్షులు అంజయ్య, కౌన్సిలర్, ఆత్మ కమిటీ డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే వాతావరణ మార్పులు, వరి, పత్తి పంటల్లో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులు, చీడపీడల నివారణ చర్యలపై అధికారులు రైతులకు అవగాహన కల్పించారు.అలాగే యూరియాను సక్రమంగా వినియోగించడం, నానో యూరియా వాడకం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. వ్యవసాయంలో యాంత్రీకరణను ప్రోత్సహించడం ద్వారా కూలీల కొరతను అధిగమించవచ్చని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న వివిధ సబ్సిడీ పథకాలను



రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# దళితులు నడిచిన రహదారి మైలైందని

## పసుపు నీళ్లతో శుభ్రం చేసిన వారిపై చర్య తీసుకోవాలని

- ముస్తాబాద్ ఎస్ఐకి ఫిర్యాదు చేసిన కాంగ్రెస్ మండల ఎస్సీ సెల్

ముస్తాబాద్/ సెప్టెంబర్ 10 ప్రజా దివాన్



ఎర్రవెల్లి లోని ఎర్రబెల్లిలోని మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు ఫామ్ హౌస్ వైపు షెడ్యూలు కులాలకు చెందిన పలువురు నాయకులు శాంతియుతంగా విడుదల కార్యక్రమం నిర్వహించిన అనంతరం దళితులు నడిచినట్లు చెప్పబడుతున్న ఎర్రవెల్లి ఫామ్హౌస్ రహదారి దళితులు రావడంతో రహదారి మైలైందని అపవిత్రమైందని భావనతో నీటిని తల్లి శుద్ధికరణ కార్యక్రమంలో నిర్వహించినట్లు వీడియోలు ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఈనాటి కంప్యూటర్ సమాజంలో కూడా కులాల వివక్షత అంటరానితనం అస్పృశ్యత ప్రోత్సహించడం ఏమిటని రహదారి శుద్ధికరణ కార్యక్రమంలో పసుపు నీళ్లు చల్లిన వ్యక్తులను గుర్తించాలి కార్యక్రమంలో ప్రత్యక్షంగా పాల్గొన్ని ప్రతి వ్యక్తిని గుర్తించి వారిపై ఎస్సీ ఎస్టీ ఆక్టివ్ ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఈ సంఘటనకు సూత్రధారులను గుర్తించి బాధ్యులైన ప్రతి ఒక్కరి పైన చట్టపరమైన చర్యలు తీసుకొని దళిత సమాజానికి న్యాయం చేయాలని దళితులు అంటే నేను చిన్న చూపు చూస్తున్న ఏ రాజకీయ పార్టీ నాయకులైన క్షమించకుండా శిక్షించాలని గురువారం రోజున కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఎర్రవల్లి ఫామ్ హౌస్ సంఘటనలో బాధ్యులైన వారి పైన కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్సై జ్యోతి కి ఫిర్యాదు చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో కరుణాకర్ బుచ్చయ్య శ్రీనివాస్ నాయకులు పాల్గొన్నారు

# పర్యావరణ హిత గణేష్ ఉత్సవాలకు శ్రీకారం

## POPకు గుడ్‌బై.. మట్టి గణపతికి వెల్‌కమ్

- ఉచిత మట్టి వినాయక విగ్రహాల పంపిణీ ప్రారంభించిన కలెక్టర్ గరిమ అగర్వాల్,ఎస్పీ మహేష్ బి గితె
- జిల్లాలో 2 వేల మట్టి వినాయక విగ్రహాల పంపిణీకి ఆదేశాలు



రాజన్న సిరిసిల్ల జిల్లా / సెప్టెంబర్ 10 ప్రజాదివాస్

పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టితో తయారు చేసిన వినాయక విగ్రహాలను ప్రతిష్టించి గణేష్ నవరాత్రి ఉత్సవాలను పర్యావరణహితంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు.తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో నిర్వహించిన ఉచిత మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, జిల్లా ఎస్పీ మహేష్ బి గితె సంయుక్తంగా ప్రారంభించారు. అనంతరం కార్యక్రమానికి సంబంధించిన అవగాహన పోస్టర్లను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (ప్రాశీ)తో తయారైన వినాయక విగ్రహాలు జలవనరులు, పర్యావరణానికి హానికరమని పేర్కొన్నారు. వాటికి బదులుగా మట్టితో తయారైన పర్యావరణహిత విగ్రహాలను వినియోగించడం ద్వారా ప్రకృతిని కాపాడటంతో పాటు సంప్రదాయాలను కూడా పరిరక్షించవచ్చని తెలిపారు.జిల్లా వ్యాప్తంగా రెండు వేల మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేయాలని అధికారులకు సూచించారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలను పర్యావరణహితంగా నిర్వహించేందుకు ప్రజలందరూ భాగస్వాములు కావాలని, ప్రకృతి వనరులు, జలాశయాల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కలెక్టర్ కోరారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఏఈఈ శ్రావణ్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# శనివారం రోజున పోటీ పరీక్షల అభ్యర్థులకు జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఉచిత అవగాహన సదస్సు..

రాజన్న సిరిసిల్ల జిల్లా / సెప్టెంబర్ 10 ప్రజాదివాస్



ఎస్ఐ, కానిస్టేబుల్ మరియు వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకుని పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించేందుకు జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత అవగాహన సదస్సుకు పేర్లు నమోదు చేసుకున్న అభ్యర్థులు శనివారం రోజున (12/09/2026) ఉదయం 08:30 గంటలకు సిరిసిల్ల పట్టణంలోని లహరి బ్రాంకెట్ హాల్ లో హాజరు కావాలని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. స్ట్రెస్ మేనేజ్‌మెంట్, సబ్జెక్టుల వారీగా నిపుణులచే శిక్షణ, పరీక్షల విధానం, సమయపాలన, పరీక్షలకు సమర్థవంతంగా సన్నద్ధం కావడానికి అవసరమైన ముఖ్యమైన సూచనలు సదస్సులో అందించనున్నట్లు తెలిపారు.జిల్లా పోలీస్ శాఖ కల్పిస్తున్న ఈ సదవకాశాన్ని అభ్యర్థులు సద్వినియోగం చేసుకుని, తమ నైపుణ్యాలను పెంపొందించుకుని పోటీ పరీక్షల్లో విజయాన్ని సాధించాలని ఎస్పీ ఆకాంక్షించారు.

# వినాయక నవరాత్రులు భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలి

- సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్ర చారి పిలుపు

ముస్తాబాద్/ సెప్టెంబర్ 10 ప్రజా దివాస్

వినాయక మండపాల్లో పోలీస్ నిబంధనలను నిర్వాహకులు తప్పనిసరిగా పాటించాలి సిరిసిల్ల డీఎస్పి నాగేంద్ర చారి కోరారు. ముస్తాబాద్ పోలీస్ స్టేషన్ ఆవరణలో గురువారం వినాయక మండపాల నిర్వాహకులతో పోలీసులు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. డీఎస్పీ నాగేంద్ర చారి మాట్లాడుతూ మండపాల నిర్వాహకులు భద్రత శాంతి భద్రతలు దెబ్బ తినకుండా ఇతరులకు ఇబ్బందులు కలగకుండా డీ జే లు పెట్టకూడదు అన్నారు. వాటికి అనుమతులు లేదన్నారు. వినాయక మండపాలతో పాటు విద్యుత్తు ఏర్పాట్లలో రక్షణ చర్యలు తప్పకుండా చేపట్టాలన్నారు. ఏదైనా ప్రమాదం సంభవించిన దానికి వినాయక మండపాలు నిర్వాహకులు పూర్తి బాధ్యత వహించాలన్నారు. ప్రతి మండపం వద్ద సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. మద్యం సేవించి అల్లర్లు సృష్టిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగ సమయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎలాంటి సేఫ్టీ లేకుండా కరెంటు వైర్లపై తీగలు తలగించవద్దు వినాయక మండపాల నిర్వాహకులకు ఏదైనా సమస్య ఏర్పడితే వెంటనే స్థానిక ఎస్సై కి సమాచారం అందించాలన్నారు. భక్తి పాటలు భజనలు చేసుకోవచ్చు , డీజేలు మాత్రం



పెట్టరాదు అన్నారు. ఈ సమావేశంలో రూరల్ సిఐ నాగేశ్వరరావు, స్థానిక ఎస్సై జి జ్యోతి పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

# చందుర్తిలో ఘనంగా చాకలి ఐలమ్మ వర్ధంతి..

## పాల్గొన్న మాజీ సెస్ చైర్మన్ అల్లాడి రమేష్

- ఐలమ్మ పోరాట పటిమ తరతరాలకు స్ఫూర్తిదాయకం: అల్లాడి రమేష్
- రజక సంఘం ఆధ్వర్యంలో వీరనారి చాకలి ఐలమ్మకు నివాళులు

చందుర్తి మండలం / సెప్టెంబర్ 10 ప్రజాదివాస్



రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండల కేంద్రంలో తెలంగాణ సాయుధ పోరాట వీర వనిత చాకలి ఐలమ్మ 42వ వర్ధంతి వేడుకలను రజక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలమ్మ విగ్రహానికి/చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి సిరిసిల్ల మాజీ సెస్ చైర్మన్ అల్లాడి రమేష్ ముఖ్య అతిథిగా హాజరై నివాళులర్పించి మాట్లాడారు. నాడు భూమి, భుక్తి, వెట్టిచాకిరీ విముక్తి కోసం నైజాం నవాబులు, దొరల అరాచకాలకు వ్యతిరేకంగా చాకలి ఐలమ్మ సాగించిన వీరోచిత పోరాటం తరతరాలకు స్ఫూర్తిదాయకమని ఆయన పేర్కొన్నారు. ఆమె ఆత్మగౌరవ పోరాట పటిమ తెలంగాణ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడిందని కొనియాడారు. బహుజన విప్లవానికి, మహిళా శక్తికి ఐలమ్మ ప్రతీకగా నిలిచారని అల్లాడి రమేష్ అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, రజక సంఘం ప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల బాధ్యులు, స్థానిక ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొని వీర వనిత ఐలమ్మ స్మారకార్థం నినాదాలు చేశారు.

# బావుసాయిపేటలో షార్ట్ సర్క్యూట్‌తో మంటల్లో కాలిన పూరిగుడిసె

- బూడిదైన నిత్యవసరాలు.. కట్టుబట్టలతో మిగిలిన నిరుపేద కుటుంబం
- బాధితులను ఆదుకోవాలని గ్రామస్తులు విజ్ఞప్తి

కోనరావుపేట మండలం / సెప్టెంబర్ 10 ప్రజాదివాస్



కోనరావుపేట మండలం బావుసాయిపేట గ్రామంలో గురువారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం సంభవించి ఒక పురిగుడిసె పూర్తిగా దగ్ధమైంది. గ్రామానికి చెందిన షైక్ హోలీ గౌసిబి నివాసముంటున్న గుడిసెలో ఒక్కసారిగా విద్యుత్ వైర్లు షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు చెలరేగాయి. క్షణాల వ్యవధిలోనే మంటలు గుడిసె నలుమూలలా వేగంగా వ్యాపించాయి. ఈ దారుణ ప్రమాదంలో గుడిసెలో దాచుకున్న బియ్యం, వస్త్రాలు, వంట సామగ్రి, ఇతర గృహోపకరణాలు పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. కష్టపడి కూడబెట్టుకున్న ప్రతి వస్తువూ బూడిదకావడంతో సదరు నిరుపేద కుటుంబం కట్టుబట్టలతో రోడ్డున పడింది. నిమిషాల్లోనే అంతా బూడిదైపోవడంతో బాధితులు తీవ్ర వేదనకు గురవుతున్నారు. ఘటనను గమనించిన స్థానికులు వెంటనే అక్కడికి చేరుకున్నప్పటికీ, మంటల తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఆస్తిని కాపాడుకోలేకపోయారు. నిరుపేద కుటుంబం నిరాశ్రయంగా మారిన ఈ పరిస్థితిపై స్థానిక ప్రజలు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రభుత్వ అధికారులు, రెవెన్యూ యంత్రాంగం తక్షణమే స్పందించి ప్రమాద స్థలాన్ని పరిశీలించాలని, జరిగిన నష్టాన్ని అంచనా వేసి బాధిత కుటుంబానికి అత్యవసర సహాయంతో పాటు నిత్యావసర వస్తువులు, ఆర్థిక పరిహారం అందించి ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

# పల్లిమక్త పాఠశాలలో విద్యార్థులకు ఏకరూప దుస్తుల పంపిణీ

కోనరావుపేట మండలం / సెప్టెంబర్ 10 ప్రజాదివాస్



కోనరావుపేట మండలంలోని పల్లిమక్త గ్రామ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు సర్పంచ్ జిన్న అనూష అనిల్ కుమార్ చేతుల మీదుగా ఏకరూప దుస్తులను (యూనిఫామ్స్) గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. విద్యార్థులలో భేదభావాలు లేకుండా సమానత్వం, స్నేహభావాన్ని పెంపొందించేందుకు ఏకరూప దుస్తులు ఎంతగానో తోడ్పడతాయని తెలిపారు. ప్రతి విద్యార్థి చదువుతో పాటు క్రమశిక్షణ, మంచి నడవడికను అలవర్చుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తే గ్రామానికి శ్రీరామరక్ష అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ నాయిని ప్రభాకర్, వార్డు సభ్యులు జాగిరి కిరణ్, మోకనపల్లి బాలరాజు, చిద్రవేణి నరేష్, జిన్న అర్జున్, పాఠశాల ఉపాధ్యాయులు మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# యువ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత ఫిజికల్ శిక్షణ శిబిరం సెప్టెంబర్ 13 నుండి ప్రారంభం

- పోలీస్ ఉద్యోగ అభ్యర్థులు ఇట్టి అవకాశం ని సద్వినియోగం చేసుకోగలరు-యువ ఫౌండేషన్ అధ్యక్షులు గొడిశెల తిరుపతి గౌడ్

వేములవాడ / సెప్టెంబర్ 10 ప్రజాదివాస్

వేములవాడ పట్టణ కేంద్రం గా కొనసాగుతున్న యువ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇటీవల విడుదల అయిన పోలీస్ ఉద్యోగ నియామకాల కోసం సన్నద్ధం అయ్యే అభ్యర్థులకు ఉచితంగా ఫిజికల్ శిక్షణ సెప్టెంబర్ 13 వ తేదీ నుండి ప్రారంభం చేయటం జరుగుతుంది అని, వేములవాడ డి ఎస్పీ ఆఫీస్ దగ్గర గల గ్రౌండ్ నందు ప్రతీ రోజు ఉదయం శిక్షణ ఉంటుంది అని ఫౌండేషన్ వ్యవస్థాపకులు కానిస్టేబుల్ గొడిశెల రాజశేఖర్ గౌడ్ తెలిపారు.ఈ శిక్షణ లో పురుషుల కు 1600 మీటర్లు, మహిళ లకు 800 మీటర్లు, లాంగ్ జంప్, షాట్ పుట్ నందు మెలకువలు నేర్పించి ఫిజికల్ ఈవెంట్స్ నందు



అత్యుత్తమ మార్కులు సాధించే విధంగా శిక్షణ ఇవ్వటం జరుగుతుంది అని ఫిజికల్ ఈవెంట్స్ లో మెరిట్ మార్కులు సాధిస్తే పోలీస్ ఉద్యోగం పొందటం లో ఈ మార్కులు దోహదపడుతాయి అని,ఇట్టి ఉచిత శిక్షణ శిబిరం ను ఉపయోగించుకొని యువతీ యువకులు పోలీస్ ఉద్యోగాలు పొంది సమాజానికి రక్షణ, సేవ చేయాలి అని కోరుకుంటున్నాం అని తెలిపారు.

ప్రజా దివాస్ తెలుగు దినపత్రిక



# దళిత బిడ్డలు అడుగు పెడితే దారి ఘుడి మైల పడ్డదా ?

**- దళితులు ఫాంహౌస్ ను తాకారని పసుపు నీళ్లతో శుద్ధి చేయించిన కేసీఆర్.......**

పసుపు నీటితో శుద్ధి చేసిన బిఆర్ఎస్ పార్టీ నాయకులపై వెంటనే చర్యలు తీసుకోవాలని తాడ్వాయి ఏ ఎస్సై గారికీ పిర్యాదు చేసిన తాడ్వాయి మండల కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు పురుషోత్తం నారాయణగారు.....ఇంకా మనం ఏ కాలంలో ఉన్నాం అనేది దళిత సామాజికవర్గం గమనించాలి......దళితులు అంటే ఇంతా చిన్న చూపా కేసీఆర్ కు , బిఆర్ ఎస్ పార్టీ నాయకులకు........దళిత సమాజ ఆత్మగౌరవాన్ని అవమానపరిచినట్టే , ఖబడ్దార్ బిఆర్ ఎస్ పార్టీ నాయకులరా..!బిరాష్ట్ర మంత్రి వర్యులు సీతక్క గారి ఆదేశాల మేరకు, జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్ గారి , జిల్లా ఎస్సీ సెల్ డిపార్ట్మెంట్ చైర్మన్ మట్టేవాడ తిరుపతి గారి సూచనల మేరకు...దళితులు నడిచిన ప్రజా రహదారిని "మైలైంది/అపవిత్రమైంది అంటూ..పసుపు నీటితో శుద్ధి చేసిన కార్యక్రమంలో పాల్గొన్న వ్యక్తులపై, అంటరానితనం మరియు కుల వివక్షకు సంబంధించిన చట్టాల కింద ఖీ×= నమోదు చేసి చర్యలు తీసుకోవాలని తాడ్వాయి ఏఎస్సై గారికీ ఫిర్యాదు ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి వావిలాల రాంబాబు గారి తో కలిసి పిర్యాదు చేసిన తాడ్వాయి మండల కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు పురుషోత్తం నారాయణ గారు...ఈ సందర్భంగా మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు పురుషోత్తం నారాయణ గారు మాట్లాడుతూ 07-09-2026న ఎర్రవెల్లిలోని మాజీ ముఖ్యమంత్రి శ్రీ కె. చంద్రశేఖర్ రావు గారి ఫామ్‌హౌస్ వైపు షెడ్యూల్డ్ కాస్ట్ (దళిత) సమాజానికి చెందిన పలువురు శాంతియుతంగా నిరసన కార్యక్రమం నిర్వహించిన అనంతరం, దళితులు నడిచినట్లు చెప్పబడుతున్న ప్రజా రహదారి/ప్రాంతాన్ని కొంతమంది వ్యక్తులు మైలైంది/అపవిత్రమైంది"అనే భావనతో పసుపు నీటిని చల్లి శుద్ధీకరణ కార్యక్రమం నిర్వహించినట్లు వీడియోలు, ఫోటోలు మరియు సోషల్ మీడియా పోస్టుల ద్వారా మా దృష్టికి వచ్చింది అని అన్నారు......దళితులు నడిచిన ప్రాంతాన్ని అపవిత్రంగా పరిగణించి శుద్ధి చేయడం నిజమైతే, అది కుల వివక్ష మరియు అంటరానితనం ఆచరణను సూచించే తీవ్రమైన చర్యగా పరిగణించబడుతుంది. ఇది దళిత సమాజం ఆత్మగౌరవాన్ని తీవ్రంగా అవమానపరిచే చర్య. అనీ అన్నారు.....శుద్ధీకరణ కార్యక్రమంలో పసుపు నీరు చల్లిన వ్యక్తులను గుర్తించాలి , కార్యక్రమంలో ప్రత్యక్షంగా పాల్గొన్న ప్రతి వ్యక్తిని గుర్తించి విచారించాలి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన, నిర్వహించిన లేదా ప్రోత్సహించిన వ్యక్తులను గుర్తించాలి ఈ కార్యక్రమానికి సంబంధించిన వీడియోలు, ఫోటోలు మరియు సోషల్ మీడియా పోస్టులను ఎలక్ట్రానిక్ ఆధారాలుగా సేకరించి భద్రపరచాలి శుద్ధీకరణ కార్యక్రమాన్ని నిర్వహించడానికి ఎవరైనా ఆదేశాలు ఇచ్చారా, సహకరించారా లేదా ప్రోత్సహించారాలి అనే విషయాన్ని కూడా దర్యాప్తు చేయాలనీ అని



అన్నారు...బిఈ ఘటనకు సంబంధించిన జజుఎ ఫుటేజ్, వీడియోలు, ఫోటోలు, సోషల్ మీడియా పోస్టులు మరియు ఇతర సాక్ష్యాలను వెంటనే సేకరించాలని ఈ ఘటనకు ప్రత్యక్ష సాక్షులైన వ్యక్తుల వాంగ్మూలాలను నమోదు చేయాలి.దళితులు నడిచిన రహదారిని అపవిత్రంగా భావించి శుద్ధి చేసినట్లు వచ్చిన ఆరోపణలు నిజమని దర్యాప్తులో తేలితే, అది భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 17లోని అంటరానితనం నిషేధానికి విరుద్ధమైన చర్యగా , శుద్ధీకరణ కార్యక్రమంలో ప్రత్యక్షంగా పాల్గొన్న ప్రతి వ్యక్తిని గుర్తించి, వారిపై చట్ట ప్రకారం కేసు నమోదు చేసి, నిష్పక్షపాతంగా సమగ్ర దర్యాప్తు నిర్వహించి, దోషులు తేలిన వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.....ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు గజ్జల సంపత్ , మండల నాయకులు బండారి చంద్రయ్య , వాసంపల్లి రాంబాబు , తాడ్వాయి మండల సోషల్ మీడియా కో ఆర్డినేటర్ గజ్జల రాజశేఖర్ తదితర నాయకులు పాల్గొన్నారు......

# న్యూ శాయంపేట పోచమ్మ బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న ఇనగాల వెంకట్రామ్ రెడ్డి

**- హనుమకొండ డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి**

ప్రజాదివాస్



హనుమకొండ నగరంలోని న్యూ శాయంపేట 31వ డివిజన్‌లో గురువారం పోచమ్మ బోనాల ఉత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి.ఈ వేడుకల్లో భాగంగా డివిజన్ మాజీ కార్పొరేటర్ మామిండ్ల రాజు యాదవ్, వేల్పుల మోహన్ రావుల ప్రత్యేక ఆహ్వానం మేరకు హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఇనగాల వెంకట్రామ్ రెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు బోనాల పండుగ ప్రతీక అని కొనియాడారు. న్యూ శాయంపేట 31వ డివిజన్ ప్రజలందరికీ, అలాగే హనుమకొండ జిల్లా ప్రజలకు బోనాల పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ మాస్టర్ ట్రైనింగ్ కమిటీ మెంబర్ మారంరెడ్డి కౌటిల్ రెడ్డి, వేల్పుల రోహిత్, స్థానిక కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

# గణేష్ మండపాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

**- గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశం**

**- ఆత్మకూరు ఇన్స్పెక్టర్ బాబులాల్**



ప్రజాదివాస్

ఆత్మకూరు పోలీస్ స్టేషన్లో మండలంలోని అన్ని గ్రామాల గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో/నిర్వాహకులతో ఆత్మకూరు ఇన్స్పెక్టర్ బాబులాల్ మీటింగ్ నిర్వహించి వారికి సూచనలు చేశారు. అవి ప్రతి మండపం వద్ద సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని, గణేష్ మండపాలు ప్రజా రవాణాకు ఎమర్జెన్సీ వాహనాలకు, ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా ఏర్పాటు చేసుకోవాలని, మండపం ఏర్పాటు చేసే స్థలం కోసం సంబంధిత శాఖల వారితో పర్మిషన్ తీసుకోవాలని, డీజే లు ఏర్పాటు చేయరాదని, రాత్రి 10 గంటల వరకు మాత్రమే స్పీకర్స్ వినియోగించాలని, మండపంలో రౌండ్ ద క్లాక్ ఒక వాలంటీర్ ఉండాలని, మండపంలో ప్లేయింగ్ కార్డ్స్ ఆడడం వంటివి చేయరాదని, పాయింట్ బుక్ ఏర్పాటు చేయాలని, ఏదైనా సమస్య ఉంటే డయల్ 112 కు కాల్ చేయాలని మరియు తెలంగాణ పోలీస్ వెబ్ సైట్ లో గణేష్ నమోదు కోసం ఆన్లైన్ దరఖాస్తు చేసుకోవాలని చేశారు.ఇట్టి కార్యక్రమంలో ఆత్మకూర్ ఎస్సై తిరుపతి మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# పట్టా ఉన్నా.. పట్టించుకోని వైనం.!

## సిద్దిపేటలో రెవెన్యూ అధికారుల తీరుపై తీవ్ర విమర్శలు



తెలంగాణ ప్రభుత్వం

(04) జిల్లా : సిద్దిపేట్ డివిజన్ : సిద్దిపేట

మండలం : నంగునూరు గ్రామము : అంక్షాపూర్

భూమి వివరములు తేదీ : 03-01-2026

| క్ర సం. | సర్వే నెంబర్/ సబ్ డివిజన్ నెంబర్ | విస్తీర్ణము | భూమి పొందిన పద్ధతి | రిమార్కులు | సం |
|---|---|---|---|---|---|
| 1 | 40/అ | 3.1600 | పౌతి /వారసత్వం / అనువంశికము | పట్టా | |
| 2 | 40/అ2 | 2.0000 | అనువంశికము | పట్టా | |
| 3 | 58/ఇ | 0.3800 | పౌతి /వారసత్వం / అనువంశికము | పట్టా | |
| పూర్తి విస్తీర్ణం | | 6.1400 | | | |



పట్టాదారు పాసు పుస్తకం

భూమి యాజమాన్య హక్కు పత్రం

జిల్లా: సిద్దిపేట్ డివిజన్: సిద్దిపేట

మండలం: నంగునూరు గ్రామం: అంక్షాపూర్

పాస్ బుక్ నెం. : T10170110297

ఖాతా నెం.: 346

1. పట్టాదారు పేరు ఇంటిపేరుతో : రుక్కమ్మ
2. తండ్రి / భర్త పేరు : మల్లా రెడ్డి
3. స్త్రీ / పురుషుడు : Female
4. చిరునామా : అంక్షాపూర్
5. కులము : General
6. ఆధార్ సంఖ్య : XXXXXXXX0293
7. పట్టాదారు సంతకం ఎడమ / కుడి చేతి వేలిముద్ర

(01)

తహశీల్దార్ సంతకం



**- సిద్దిపేటలో వృద్ధురాలి భూమికి రక్షణ కరువు**

**- కొలతలకు డీడీ కట్టి 7 నెలలు.. కదలని ఫైలు, రాని అధికారులు**

**- సర్వేకు ఉన్నతాధికారి రాకుండా అసిస్టెంట్లను పంపి తప్పుడు నివేదిక.?**

**- కబ్జాదారులకు అనుకూలంగా ఫెన్సింగ్ వేసి అదే హద్దు అంటూ నిర్ణయం? ఫోటోలే సాక్ష్యం**

**- న్యాయం కోసం కలెక్టర్ ను ఆశ్రయించిన బాధితురాలు**

ప్రజాదివాస్

సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం అంకాపూర్ గ్రామంలో ఓ వృద్ధురాలి కన్నీటి గాథ వెలుగులోకి వచ్చింది. పట్టా పాస్ పుస్తకం ఉన్న తన సొంత భూమిని కాపాడుకోవడం కోసం ఆమె ఏడు నెలలుగా రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతోంది. ఫీజు కట్టినా కొలతలు వేయని అధికారులు, ఫెన్సింగ్ ధ్వంసమైనా పట్టించుకోని యంత్రాంగం తీరుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.అంకాపూర్ గ్రామానికి చెందిన బాధితురాలు రుక్కమ్మకు గ్రామ శివారులో సర్వే నెం. 40 లో పట్టా భూమి ఉంది. దీనికి సంబంధించి పట్టాదార్ పాస్ పుస్తకం, ఖాతా నెంబర్ తో సహా అన్ని రెవెన్యూ రికార్డులు ఆమె పేరిటే ఉన్నాయి. కానీ రోజుకో తీరు.. ఒకరోజు 17 గుంటలు తక్కువగా ఉంది.. ఒకరోజు 36 గుంటలు తక్కువగా ఉంది అని అధికారులు చెబుతున్న తీరు.. దీనిపై అధికారుల నిర్లక్ష్యమా వారు ఎవరికి సపోర్ట్ చేస్తున్నారు ఏమిటి అన్నది ప్రశ్నార్థకంగా మారిందని చెప్పుకోవచ్చు.!

**అసలు వివాదం ఏంటి?**

కొంతకాలంగా కొందరు వ్యక్తులు ఆమె భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తూ, ఆమె వేయించిన సిమెంట్ ఫెన్సింగ్ స్తంభాలను కూల్చివేసి, గుంతలు తవ్వి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని బాధితురాలు ఆరోపిస్తోంది.7 నెలలుగా పెండింగ్ లోనే ఫైలు - రావాల్సిన అధికారి రాలేదు!

తన భూమికి శాశ్వత పరిష్కారం చూపాలని బాధితురాలు 2026 ఫిబ్రవరి నెలలోనే ఎ డి సర్వే ఒ ల్యాండ్ రికార్డ్స్ విభాగానికి దరఖాస్తు చేసుకుని, చలానా / డీడీ రూపంలో ఫీజు చెల్లించింది. ఫైల్ నెం. ఎ 3/19/2026 గా నమోదైంది.నిబంధనల ప్రకారం ఉన్నతాధికారి స్వయంగా రావాలి. కానీ బాధితురాలి తాజా ఆరోపణ ప్రకారం, ఫిర్యాదు చేసి డీడీ కట్టినా రావాల్సిన సర్వే ఉన్నతాధికారి రాకుండా తన అసిస్టెంట్లను పంపించారు.అత్యంత కీలక ఆరోపణ - తప్పుడు నివేదికతో కబ్జాదారులకు వత్తాసు?అక్కడికొచ్చిన అసిస్టెంట్లు క్షేత్రస్థాయి వాస్తవాలను పరిగణనలోకి తీసుకోకుండా తప్పుడు నివేదిక సమర్పించారని, దీంతో బాధితురాలికి న్యాయం జరగాల్సిన చోట, యథేచ్ఛగా కబ్జాదారులకు అనుకూలంగా ఫెన్సింగ్ వేసి "ఇదే వారి హద్దు" అని నిర్ణయించారని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేస్తోంది.ఈ ఒక్క అంశంతోనే అధికారుల పనితీరు ఏమిటో, వారికి ఎవరి మద్దతు ఉందో క్లియర్ గా అర్థమవుతోందని స్థానికులు చర్చించుకుంటున్నారు. పట్టా ఉన్న అర్హురాలికి కాకుండా కబ్జాదారులకు ఫెన్సింగ్ వేసి సహకరించడం వెనుక ఆంతర్యం ఏమిటనే ప్రశ్న ఇప్పుడు జిల్లా వ్యాప్తంగా హాట్ టాపిక్ గా మారింది.

# గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించాలి

ప్రజాదివాస్




మండల పరిధిలోని గ్రామాల్లో నిర్వహించనున్న శ్రీ గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించాలని నిర్వాహకులకు పోలీసులు సూచించారు.ఈ మేరకు గురువారం ధర్పల్లిలోని పద్మశాలి కమ్యూనిటీ భవన్‌లో గణేష్ ఉత్సవ కమిటీల నిర్వాహకులతో ఆర్గనైజర్ సమావేశం నిర్వహించారు.మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.ఉత్సవాల నిర్వహణ సందర్భంగా తీసుకోవాల్సిన భద్రతా చర్యలు, పాటించాల్సిన నిబంధనలు, శాంతిభద్రతల పరిరక్షణ, ఊరేగింపులు, నిమజ్జనం సమయంలో అనుసరించాల్సిన ముందస్తు జాగ్రత్తలపై నిర్వాహకులకు అధికారులు అవగాహన కల్పించారు. అందరూ పరస్పర సహకారంతో భక్తిశ్రద్ధలతో ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని సూచించారు.

# నామాపూర్ పాఠశాలకు ఫర్నిచర్ ఎలక్ట్రానిక్ సామాగ్రి అందజేత..

ప్రజాదివాస్

మెదక్ జిల్లా పాపన్నపేట మండలం నామాపూర్ ప్రభుత్వ పాఠశాలకు అమెరికాలో నివసిస్తున్న ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ మన్నే ఉపేందర్ గురువారం ఫర్నిచర్‌తో పాటు ఎలక్ట్రానిక్ సామాగ్రిని అందజేశారు. పాఠశాల అవసరాల కోసం ప్రింటర్, సౌండ్ బాక్స్, ప్రొజెక్టర్ తదితర సామాగ్రిని ఆయన అందించారు.అదేవిధంగా పాఠశాలకు అదనపు తరగతి గది నిర్మాణానికి కూడా డాక్టర్ మన్నే ఉపేందర్ సహకారం అందించారు. విద్యార్థుల సౌకర్యాలు, విద్యా ప్రమాణాల మెరుగుదలకు తన వంతు సహకారం అందిస్తున్న శాస్త్రవేత్తకు గ్రామస్తులు, పాఠశాల సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, పాఠశాల చైర్మన్, ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్‌తో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.



TGTEL/25/A0827
ప్రజా దివాస్
తెలుగు దినపత్రిక
11-09-2026

# ప్రజా పోరాటాలకు స్ఫూర్తి చాకలి ఐలమ్మ

## పేదల విముక్తి కోసం పోరాడిన వీరనారి..



ప్రజాదివాస్

సమాజంలోని బలహీన వర్గాల హక్కుల కోసం తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ త్యాగం ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ (ఆర్‌యూపీపీటీ) రాష్ట్ర ఉపాధ్యక్షులు గఫూర్ శిక్షక్ అన్నారు.కామారెడ్డి డివిజన్ అధ్యక్షులు సుదర్శన్ అధ్యక్షతన కామారెడ్డిలోని పండిత పరిషత్ కార్యాలయంలో గురువారం చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గఫూర్ శిక్షక్ మాట్లాడుతూ తెలంగాణలో తొలి భూ పోరాటానికి నాంది పలికిన వీరమాతగా ఐలమ్మ నిలిచారని అన్నారు. సామాజిక మార్పుకు నాంది పలికిన ధైర్యశాలిగా, జమీందారీ దోపిడీకి ఎదురు నిలిచిన సాహస వనితగా ఆమె చరిత్రలో నిలిచిపోయారని పేర్కొన్నారు.దళిత, బహుజనుల హక్కులు, పేదల విముక్తి కోసం చాకలి ఐలమ్మ సాగించిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని తెలిపారు. ఆమె ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పండిత పరిషత్ డివిజన్ అధ్యక్షులు సుదర్శన్, ప్రధాన కార్యదర్శి రాజయ్య, ఉపాధ్యక్షులు సంతోష్ రాజ్, శ్యాం కుమార్, రాష్ట్ర బాధ్యులు వంశీధర్, జిల్లా బాధ్యులు చంద్రశేఖర్, రాములు తదితరులు పాల్గొన్నారు.

# నిజం గెలిచింది నిజమే గెలిచింది

**- చంద్రన్న అరెస్టుతో ఆయన చేసిన సేవలు ప్రపంచానికి తెలిశాయి ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య**




ప్రజాదివాస్

నందిగామ ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం తెలుగుదేశం పార్టీ అధినేత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సాగించిన పోరాటాన్ని స్మరించుకుంటూ నందిగామ పట్టణం రైతుపేటలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిజం గెలిచింది నిజమే గెలిచింది కార్యక్రమాన్ని నిర్వహించారు నియోజకవర్గ పరిశీలకులు తాళ్ల వెంకటేష్ యాదవ్ మరియు కూటమి నేతలతో కలిసి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య 53 కొవ్వొత్తులను వెలిగించి కార్యక్రమంలో పాల్గొన్నారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మాట్లాడుతూ చంద్రుడికైనా మచ్చ ఉంటుందేమో ఎటువంటి అవినీతి మచ్చలేని నాయకుడు మన చంద్రన్న అని అన్నారు చంద్రబాబు నాయుడు అక్రమంగా అరెస్టు చేసిన రోజులు రాష్ట్ర చరిత్రలో ఒక చీకటి అధ్యాయంగా నిలిచిపోయాయని అయితే ఆయన జైలులో గడిపిన 53 రోజులు ఆయనపై ప్రజలకు ఉన్న అభిమానాన్ని మరింత బలపరిచాయని పేర్కొన్నారు చంద్రబాబు నాయుడు అరెస్టుతో బయటపడింది ఆయన చేసిన సేవలే ఎవరినైనా అరెస్టు చేస్తే వారి నేరాలు బయటకు వస్తాయని కానీ చంద్రబాబు నాయుడు అరెస్టు చేస్తే ఆయన చేసిన అమోఘమైన సేవలు రాష్ట్ర అభివృద్ధికి ఆయన అందించిన కృషి, ప్రజల కోసం ఆయన చేసిన పోరాటాలు ప్రపంచానికి తెలిసివచ్చాయని తంగిరాల సౌమ్య అన్నారు ఆనాడు చంద్రబాబు నాయుడు ప్రజాస్వామ్యబద్ధంగా శాంతియుతంగా పోరాటం చేద్దామని పిలుపునిచ్చారని ఆయన తనయుడు నారా లోకేష్ సైతం తన పాదయాత్రను నిలిపివేసి నేలపై కూర్చొని నిరసన తెలిపారని గుర్తుచేశారు చంద్రన్నకు అండగా కదిలిన ప్రపంచవ్యాప్తంగా తెలుగు సమాజం చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా ప్రపంచవ్యాప్తంగా 75కు పైగా దేశాల్లోని తెలుగు ప్రజలు స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు హైదరాబాద్ గచ్చిబౌలిలో వేలాది మంది ఐటీ ఉద్యోగులు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించి తమ మద్దతును ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు ఇంటికే పరిమితమైన భువనమ్మ సైతం నిజం గెలవాలి అనే నినాదంతో రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చారని అన్నారు కూటమి విజయానికి ఆనాడే పునాది జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చంద్రబాబు నాయుడు అరెస్టు సమయంలో స్పందించిన తీరు రాజమండ్రి పర్యటనకు వెళ్తున్న సమయంలో ఎదురైన అడ్డంకులకు వ్యతిరేకంగా రోడ్డుపై కూర్చొని నిరసన తెలిపిన ఘటనలు ప్రజలు ఎప్పటికీ మర్చిపోలేరని తంగిరాల సౌమ్య అన్నారు ఆ రోజుల్లోనే అప్పటి ప్రభుత్వంపై ప్రజాస్వామ్య పోరాటానికి బీజం పడిందని తెలుగుదేశం--జనసేన--బీజేపీ కూటమి ప్రభుత్వం ఏర్పాటుకు ఆనాడే పునాది పడిందని పేర్కొన్నారు వైసీపీకి ప్రజలు ఇచ్చిన తీర్పు చారిత్రాత్మకం ఇటీవల జరిగిన ఎన్నికల్లో వైసీపీకి కేవలం 11 అసెంబ్లీ స్థానాలతో ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చారని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు ప్రజాస్వామ్యాన్ని అణచివేసే పాలనను ప్రజలు తిరస్కరించారని పేర్కొన్నారు ప్రతి సంవత్సరం ఈ రోజును చీకటి రోజు గా గుర్తు చేసుకుంటూ ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాటం ప్రారంభమైన రోజుగా పార్టీ శ్రేణులు స్మరించుకోవాలని పిలుపునిచ్చారు 53 రోజులకు గుర్తుగా 53 కొవ్వొత్తులు చంద్రబాబు నాయుడు గారు జైలులో 53 రోజులు గడిపిన సందర్భంగా 53 కొవ్వొత్తులను వెలిగించి కార్యక్రమాన్ని నిర్వహించారు రాష్ట్రవ్యాప్తంగా ప్రతి గ్రామంలో క్లస్టర్ యూనిట్ పోలింగ్ బూత్ పరిధిలో ఇదే కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులు నిర్వహించినట్లు తెలిపారు చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి సంక్షేమంలో ముందుకు తీసుకెళ్తోందని రానున్న రోజుల్లో ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేస్తామని తంగిరాల సౌమ్య అన్నారు ప్రజా సంక్షేమం అభివృద్ధిని పరుగులు పెట్టిస్తూ రాష్ట్రాన్ని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు

# మరోసారి మానవత్వం చాటుకున్న పోలీసులు..

**-ముగ్గురి ప్రాణాలను కాపాడిన పోలీసు కానిస్టేబుళ్లు..**

**-సమయస్ఫూర్తితో స్పందించి తల్లి, ఇద్దరు చిన్నారులను రక్షించిన పోలీసులు**

ప్రజాదివాస్




వ్యక్తిగత కారణాలు, మనస్తాపంతో ఆత్మహత్యకు యత్నించిన ఓ తల్లి, ఆమె ఇద్దరు చిన్నారులను పోలీసులు సమయస్ఫూర్తితో స్పందించి కాపాడారు. తల్లి, పిల్లలను సురక్షితంగా రక్షించి మానవత్వంతో పాటు వృత్తిధర్మాన్ని చాటుకున్నారు.చుక్కాపూర్ గ్రామానికి చెందిన సంధ్యారాణి (30) వ్యక్తిగత కారణాలతో తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడాలని నిర్ణయించుకుంది. తన ఐదేళ్ల కుమారుడు, మూడేళ్ల కుమార్తెను పాఠశాల నుంచి ఇంటికి తీసుకెళ్లకుండా నేరుగా రైల్వే ట్రాక్ వద్దకు తీసుకెళ్లింది.ఈ విషయం పోలీసులకు తెలియగానే కానిస్టేబుల్ కళ్యాణ్ (పి.సి.-2918), రామకృష్ణ (ఏ.ఆర్.పి.సి.-3042) వెంటనే స్పందించి రైల్వే ట్రాక్ వద్దకు చేరుకున్నారు. అత్యంత చాకచక్యంగా వ్యవహరించి తల్లితో పాటు ఇద్దరు చిన్నారులను సురక్షితంగా రక్షించి పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు.అనంతరం సంధ్యారాణికి కౌన్సెలింగ్ ఇచ్చి ధైర్యం కల్పించారు.

# ఈ నెల 11న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయండి కేజీబీవీ జిల్లా అధ్యక్షురాలు లక్ష్మక్క

**- సీఎం ప్రకటించిన కనీస వేతనాలు అమలు చేయాలి**

**- కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి**




ప్రజాదివాస్

తెలంగాణ రాష్ట్రంలో కేజీబీవీ పాఠశాలలో పనిచేస్తున్న నాన్ టీచింగ్ సిబ్బంది వర్కర్లు వేతనం పెంచడంతోపాటు ఇతర సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ప్రగతిశీల కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్ల యూనియన్ ( టి యు సి ఐ ) ఆధ్వర్యంలో ఈ నెల 11న చలో హైదరాబాద్ కార్యక్రమం కరపత్రాలను గొర్రె లక్ష్మక్క ఆధ్వర్యంలో గురువారం జగిత్యాల జిల్లా కేంద్రంలో ఆవిష్కరించారు ఈ సందర్భంగా జిల్లా యూనియన్ అధ్యక్షురాలు లక్ష్మక్క మాట్లాడుతూ కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్ల, సిబ్బంది కొన్ని ఏండ్లుగా వేతనాలు పెరగకపోవడం పని భారం పెరగడం తో సమస్యలను విన్నవిస్తే అదనంగా నైట్ డ్యూటీలు వేస్తున్నారని ఆరోపించారు గత ప్రభుత్వంతో పోలిస్తే ప్రస్తుత ప్రభుత్వం కేజీబీవీల పట్ల మరింత కక్ష పూర్వకంగా వ్యవహరిస్తుందని విమర్శించారు మూడు సంవత్సరాలుగా అధికారులను ప్రభుత్వం ప్రజా ప్రతినిధులను కలిసి సమస్యలను పరిష్కరించాలని కోరుతున్న ఫలితం లేకపోవడంతో పోరాటం తప్ప మరో మార్గం లేదని అన్నారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించిన కనీస వేతనాలనైన తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు అకౌంటెంట్లు, వర్కర్లకు నిబంధనలు జాబ్ చార్ట్ కు విరుద్ధంగా కేటాయించిన నైట్ డ్యూటీలు రద్దు చేయాలని అలాగే వారానికి ఒకరోజు వీక్లీ ఆఫ్ అమలు చేయాలని కోరారు కాళీ పోస్టులను భర్తీ చేసి పని భారం తగ్గించాలని ప్రభుత్వ ఉద్యోగాల్లో అర్హత కలిగిన నాన్ టీచింగ్ సిబ్బందికి వెయిటేజ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు రిటైర్మెంట్ వయసు 65 ఏళ్లకు పెంచడం తో పాటు రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని పిఎఫ్, ఈఎస్ఐ అమలు చేసి ఉద్యోగ ఆరోగ్య భద్రత కల్పించాలని కోరారు సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 11న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కేజీబీవీ నాన్ టీచింగ్ సిబ్బంది వర్కర్లు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం మాచే వెట్టిచాకిరి చేయిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు కాళీ పోస్టులు భర్తీ చేసి పని భారం తగ్గించాలని పనికి తగ్గ వేతనాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని అధికారులను కోరారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షురాలు అజ్మీర స్వరూప ప్రధాన కార్యదర్శి బొగ్గుల జమున సహాయ కార్యదర్శి ఉయ్యాల కావ్య కళావతి కేజీబీవీ వర్కర్లు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# ఓయూ 85 వ స్నాతకోత్సవంలో డాక్టరేట్ పట్టా అందుకున్న తాళ్ళ అజయ్

ప్రజాదివాస్




చెన్నారావుపేట(రాజీవ్ నగర్ కాలనీ )గ్రామానికి చెందిన తాళ్ళ యాకయ్య,కరుణశ్రీ దంపతుల కుమారుడు తాళ్ళ అజయ్ ఉస్మానియా యూనివర్సిటీ ఠాగూర్ ఆడిటోరియంలో జరిగిన, 85 వ స్నాతకోత్సవంలో డాక్టరేట్ పట్టా అందుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ మరియు వర్సిటీ ఛాన్సలర్ శివ ప్రతాప్ శుక్లా అధ్యక్షత వహించగా,ముఖ్య అతిథిగా భారత్ బయోటిక్ వ్యవస్థాపకులు,చైర్మన్ డా. కృష్ణ ఎల్లా హాజరయ్యారు,ఓయూ వైస్ చాన్సలర్ ప్రో.కుమార్ మొలుగరం సమక్షంలో వారి చేతుల మీదుగా రోల్ ఆఫ్ స్టూడెంట్స్ ఇన్ తెలంగాణ మూమెంట్ (1956-2014) అనే అంశం మీద పరిశోధనకు గాను పట్టా అందుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యా ప్రయాణంలో సహకరించిన గురువులకు,బందు మిత్రులకు కృతజ్ఞతలు తెలిపారు.డాక్టరేట్ సాధించడం ద్వారా సామాజిక సేవ బాధ్యత మరింత పెరిగిందని, ఈ డాక్టరేట్ ని తనకు జన్మనిచ్చిన తల్లిదండ్రులకు, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం త్యాగాలు చేసిన విద్యార్థి, ఉద్యమకారులకు అంకితం ఇస్తున్నట్లు పేర్కొన్నారు.

# చాకలి ఐలమ్మ ఆశయ సాధనకు

## ప్రతి ఒక్కరూ కృషి చేయాలి: జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

ప్రజాదివాస్

సమానత్వానికి, వీరోచిత పోరాటానికి ప్రతీకగా నిలిచిన చారిత్రక యోధురాలు చాకలి ఐలమ్మ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పిలుపునిచ్చారు.రాష్ట్ర ప్రభుత్వ అధికారిక ఆదేశాల మేరకు, పెద్దపల్లి సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్ బి.శ్రీరాములు తోలి కలిసి , చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ చాకలి ఐలమ్మ ధైర్యసాహసాలు, పేదల భూముల కోసం, భుక్తి కోసం ఆమె చేసిన పోరాటాలు చిరస్మరణీయమని, ఆమె ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు.చాకలి ఐలమ్మగా గుర్తింపు పొందిన తెలంగాణ ఉద్యమకారిణి ,తొలి భూ పోరాటానికి నాంది పలికిన వీరమాత, సామాజిక ఆధునిక పరిణామానికి నాంది పలికిన స్త్రీ ధైర్యశాలి అని అన్నారు. వరంగల్ జిల్లా, రాయపర్తి మండలం క్రిష్టాపురం గ్రామంలో 1895 సెప్టెంబర్ 26న ఒరుగంటి మల్లమ్మ, సాయిలులకు నాల్గవ సంతానంగా జన్మించారని, 1940-44 మధ్య కాలంలో విశ్నూర్ దేశ్ముఖ్ , రజాకర్ల అరాచకాల పై



ఎదురు తిరిగి తెలంగాణ రైతాంగ పోరాటం చేసి విజయం సాధించారని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి ఎం. రవీందర్, కలెక్టరేట్ పరిపాలన అధికారి బి. ప్రకాష్ , జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు, పాల్గొన్నారు.

# అల్ప్రోజలం నిర్వహిస్తున్న వారి ఆస్తులు జప్తు ఆల్ప్రాజోలం అక్రమ రవాణాదారులపై నిజామాబాద్ పోలీసుల ఉక్కుపాదం

- నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య ఐ పీ ఎస్ 3.02 కోట్ల రూపాయల విలువైన ఆస్తుల జప్తు
- నిజామాబాద్ ఈగల్ టీం ఆధ్వర్యంలో అంతర్రాష్ట్ర ముఠా అరెస్ట్

ప్రజాదివాస్

నిజామాబాద్ లో అక్రమంగా అల్ప్రోజలం ముఠాను డ్రగ్స్ అక్రమ రవాణా ద్వారా సంపాదించిన రూపాయలు 3.02 కోట్లాది రూపాయల విలువైన ఆస్తులపై జప్తు చర్యలు అంతర్రాష్ట్ర డ్రగ్ అక్రమ సరఫరా నెట్‌వర్క్‌పై పకడ్బందీ దర్యాప్తు పోలీస్ కమీషనర్ వెల్లడి నిజామాబాద్ పోలీస్ కమీషనరేట్ పరిధిలో ఆల్ప్రాజోలం వంటి మత్తు పదార్థాల అక్రమ తయారీ , రవాణా , సరఫరా మరియు విక్రయాలకు పాల్పడుతున్న వ్యక్తులపై పోలీస్ శాఖ కఠిన చర్యలు చేపడుతోంది. నిజామాబాద్ పోలీస్ కమీషనర్ పి. సాయి చైతన్య, ఐ.పి.యస్. ఆదేశాల మేరకు, నిజామాబాద్ ఏసీపీ బి. ప్రకాష్ పర్యవేక్షణలో నిజామాబాద్ రూరల్ ఇన్‌స్పెక్టర్ సి.హెచ్. శ్రీనివాస్ మరియు నిజామాబాద్ ఈగల్ టీమ్ ఆధ్వర్యంలో చేపట్టిన దర్యాప్తులో అంతర్రాష్ట్ర ఆల్ప్రాజోలం అక్రమ సరఫరా నెట్‌వర్క్‌ను పోలీసులు ఛేదించారు. అంతర్రాష్ట్ర డ్రగ్ స్మగ్లర్ల అరెస్ట్ నిజామాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆల్ప్రాజోలం అక్రమ సరఫరాకు పాల్పడుతున్న ఐదుగురు అంతర్రాష్ట్ర డ్రగ్ స్మగ్లర్లపై క్రైమ్. నంబర్.127/2025గా ఎన్ డి పి ఎస్ ఆక్ట్ లోని సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి , వారిలో నలుగురిని అరెస్ట్ చేసి జైలుకు తరలించారు.వారి వద్ద నుండి సుమారు 1.087 కిలో గ్రామ్స్ ఆల్ఫోజోలం , దాని విలువ సుమారు రూ.4.50 లక్షలు హ్యుండాయ్ ఐ20 కారు ( ఖా 18 ఎ 4755 ), మారుతి షిఫ్ట్ డిజైర్ కారు ( ఖా 08 జు+ 2753 ), 5 మొబైల్ ఫోన్లు మరియు రూ.3.50 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు.రాజస్థాన్ నుంచి ఆల్ప్రాజోలం అక్రమ రవాణా కేసు దర్యాప్తులో భాగంగా నిందితులను విచారించగా ఆల్ప్రాజోలం అక్రమ సరఫరాకు సంబంధించిన కీలక సమాచారం వెలుగులోకి వచ్చింది. వారి విచారణ మరియు ఇతర ఆధారాల ఆధారంగా ఆల్ప్రాజోలం మాదకద్రవ్యాన్ని రాజస్థాన్ రాష్ట్రం నుండి మహారాష్ట్ర మీదుగా అక్రమంగా సరఫరా చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.అక్కడి నుండి చిన్న మొత్తాలలో వివిధ మార్గాల ద్వారా ఆల్ప్రాజోలంను నిజామాబాద్ మరియు నిర్మల్ ప్రాంతాలకు అక్రమంగా తరలించి , స్థానికంగా మాదకద్రవ్యానికి డిమాండ్ ఉన్న వ్యక్తులకు సుమారు కిలోకు రూ.4 లక్షల నుండి రూ.5 లక్షల వరకు విక్రయిస్తున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది.ఈ అక్రమ మాదకద్రవ్యాల వ్యాపారం ద్వారా నిందితులు భారీ మొత్తంలో అక్రమంగా నగదు సంపాదించినట్లు గుర్తించారు. ఆ నగదుతో కార్లు, వ్యవసాయ భూములు, ఇంటి స్థలాలు, నివాస గృహాలు కొనుగోలు చేయడంతో పాటు, బ్యాంకు ఖాతాల్లో నగదు నిల్వలు మరియు డిపాజిట్లు చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది.అక్రమంగా సంపాదించిన ఆస్తుల గుర్తింపు, జప్తుడ్రగ్స్ డబ్బుతో కూడగట్టిన రూ: 3.02 కోట్ల ఆస్తులపై జప్తు చర్యలు మాదకద్రవ్యాల అక్రమ రవాణాలో నిందితులను అరెస్ట్ చేయడంతో పాటు వారు డ్రగ్స్ అక్రమ వ్యాపారం ద్వారా సంపాదించిన ఆస్తులను గుర్తించి చట్టప్రకారం జప్తు /అటాచ్‌మెంట్ చర్యలు చేపట్టడంపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు.ఈ క్రమంలో నిజామాబాద్ , నిర్మల్ మరియు మహబూబ్‌నగర్ జిల్లాల్లోని సంబంధిత సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలు , తహశీల్దార్ కార్యాలయాలను సంప్రదించి నిందితులు మరియు వారి కుటుంబ సభ్యులకు సంబంధించిన స్థిర , చర ఆస్తుల వివరాలను సేకరించారు. దర్యాప్తులో ఈ1 గంధం శ్రీనివాస్ గౌడ్ మరియు వారి కుటుంబ సభ్యులు , ఈ2 బొట్ల కాటమయ్య గౌడ్ ఆల్ప్రాజోలం అక్రమ విక్రయాల ద్వారా సంపాదించినట్లు అనుమానిస్తున్న ఆస్తులను గుర్తించారు. ప్రభుత్వ విలువల ప్రకారము సుమారు రూ : 3.02 కోట్ల ఆస్తులను గుర్తించగా బహిరంగ మార్కెట్లో వాటి విలువ ఎన్నోరెట్లు ఎక్కువగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు.గుర్తించిన ఆస్తులపై సంబంధిత కాంపిటేంట్ అథారిటీ , చెన్నై వారి ద్వారా ఎన్.డి.పి.ఎస్ యాక్ట్ సెక్షన్ 68ఎఫ్ (2) కింద జప్తు/అటాచ్‌మెంట్ చర్యలకు ఆదేశాలు జారీ అయ్యాయి. జప్తు/అటాచ్‌మెంట్ చేసిన ఆస్తుల వివరాలు 1) 4.20 ఎకరాల వ్యవసాయ భూమి 2) 667 చదరపు గజాల ఖాళీ స్థలాలు 3) 2 నాలుగు చక్రాల వాహనాలు 4) 1 ద్విచక్ర వాహనం 5) బ్యాంకు ఖాతాల్లో ఉన్న సుమారు రూ.5 లక్షల నగదు నిందితులు అక్రమంగా సంపాదించిన ఆస్తులను గుర్తించి , సంబంధిత అధికారుల ద్వారా జప్తు / అటాచ్‌మెంట్ చర్యలు చేపట్టేందుకు సుమారు ఒక సంవత్సరం పాటు నిరంతర దర్యాప్తు మరియు న్యాయపరమైన ప్రక్రియ కొనసాగింది.సాంకేతిక పరిజ్ఞానంతో కీలక ఆధారాల సేకరణ ఈ కేసు దర్యాప్తులో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పోలీసులు సమర్థవంతంగా వినియోగించారు. నేరంతో సంబంధం ఉన్న సుమారు 10 మంది వ్యక్తుల మొబైల్ ఫోన్ సమాచారాన్ని సేకరించి, విశ్లేషించి , దర్యాప్తుకు అవసరమైన కీలక సమాచారాన్ని సేకరించారు.ఆల్ప్రాజోలం అక్రమ రవాణాను గుర్తించడం నుంచి డ్రగ్ నెట్‌వర్క్‌ను ఛేదించడం , అక్రమంగా సంపాదించిన ఆస్తులను గుర్తించడం , వాటిపై చట్టపరమైన



జప్తు / అటాచ్‌మెంట్ చర్యలు చేపట్టే వరకు సుమారు 10 మంది పోలీసు సిబ్బంది చేసిన నిరంతర కృషి ఫలితంగానే ఈ చర్యలు సాధ్యమయ్యాయని పోలీస్ కమీషనర్ తెలిపారు.డ్రగ్ నెట్‌వర్క్‌పై ఆర్థిక దర్యాప్తు కూడా కొనసాగుతుంది డ్రగ్స్ అక్రమ రవాణాలో పాల్గొనే వ్యక్తులను అరెస్ట్ చేయడం మాత్రమే కాకుండా , మాదకద్రవ్యాల అక్రమ వ్యాపారం ద్వారా సంపాదించిన అక్రమ ఆస్తులను గుర్తించి జప్తు చేయడం ద్వారా డ్రగ్ మాఫియాపై ఆర్థికంగా కూడా గట్టి దెబ్బ కొట్టే విధంగా చర్యలు కొనసాగిస్తామని పోలీస్ కమీషనర్ స్పష్టం చేశారు.మాదకద్రవ్యాల తయారీ , కొనుగోలు , రవాణా , నిల్వ , పంపిణీ , విక్రయాలు , ఆర్థిక లావాదేవీలు మరియు వినియోగం వరకు మొత్తం డ్రగ్ వ్యవస్థపై నిరంతర నిఘా కొనసాగుతుందని , అంతర్ జిల్లా పోలీసుల సమన్వయంతో దర్యాప్తును మరింత విస్తృతం చేస్తామని తెలిపారు.ఈ కేసును ఛేదించడంలో కీలక పాత్ర పోషించిన నిజామాబాద్ రూరల్ ఇన్‌స్పెక్టర్ సి. హెచ్. శ్రీనివాస్ సంబంధిత పోలీసు సిబ్బందిని మరియు నిజామాబాదు ఈగల్ టీమ్ ను పోలీస్ కమీషనర్ పి. సాయి చైతన్య, ఐ.పి.యస్. ప్రత్యేకంగా అభినందించి ప్రశంసించారు.యువత విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి పోలీస్ కమీషనర్ నిజామాబాద్ పోలీస్ కమీషనర్ పి. సాయి చైతన్య, ఐ.పి.యస్. ప్రజలకు ముఖ్యంగా యువత మరియు విద్యార్థులకు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. తల్లిదండ్రులు , ఉపాధ్యాయులు , విద్యాసంస్థల నిర్వాహకులు , ప్రజాప్రతినిధులు మరియు సమాజంలోని ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.డ్రగ్స్ అక్రమ రవాణా , అక్రమ నిల్వ , విక్రయాలు లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్ 112 కు సమాచారం అందించాలని కోరారు.డ్రగ్ నెట్‌వర్క్‌లను పూర్తిగా నిర్మూలించడంలో , ఆల్ప్రాజోలం వంటి మత్తు పదార్థాల దుర్వినియోగాన్ని అరికట్టడంలో ముఖ్యంగా యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడడంలో ప్రజల సహకారం అత్యంత కీలకమని పోలీస్ కమీషనర్ తెలిపారు.

# నల్ల బ్యాడ్జిలతో కాంగ్రెస్ నాయకుల నిరసన

ప్రజాదివాస్



దళిత సామాజిక వర్గం పట్ల బి ఆర్ ఎస్ నాయకులు , ఫాం హౌస్ ప్రాంతంలో పసుపు నీళ్ళతో శుద్ధి చేయడం పట్ల జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండల కాంగ్రెస్ నాయకులు గురువారం నల్ల బ్యాడ్జిలతో నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పిలుపు మేరకు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తాటిపర్తి శైలేందర్ రెడ్డి ఏఎంసీ చైర్మన్ గొల్ల తిరుపతి ఆధ్వర్యంలో , వెల్గటూర్ అంబేద్కర్ కూడలి వద్ద కాంగ్రెస్ నాయకులు అంత కలిసి నల్ల బ్యాడ్జిలతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా శైలేందర్ రెడ్డి మాట్లాడుతూ దళితుల ఆత్మగౌరవాన్ని అణచివేస్తే సహించబోం అని తెలిపారు. దళితులను కించ పరిచేలా , ఫాం హౌస్ పరిసరాలను పసుపు నీళ్ళతో శుద్ధి చేయడం తప్పు విషయం అని ఇది వారి ఆత్మగౌరవం ను దెబ్బ తీసినట్లే అని పేర్కొన్నారు . దళితులకు దళిత నాయకులకు బి ఆర్ ఎస్ పార్టీ వాళ్ళు ముమ్మాటికి అవమానించారు తక్షణమే క్షమాపణలు చెప్పాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కోటిలింగాల ఆలయ చైర్మన్ పూదరి రమేష్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మెరుగు నరేష్ గౌడ్ , గుమ్ముల వెంకటేష్ రంగు తిరుపతి గౌడ్ వెల్గటూర్ మాజీ సర్పంచ్ ఉప సర్పంచ్ మెరుగు మురళి గౌడ్ సందీప్ రెడ్డి బరపటి జనార్ధన్ గుమ్ముల అజయ్ లక్ష్మణ్ గాజుల మల్లేశం రాజయ్య భూమన్న పెద్ద ఎత్తున కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బౌద్ధ రాతి గుహలను సందర్శించిన జిల్లా టూరిజం నోడల్ అధికారిణి అనూష

ప్రజాదివాస్



:: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకల్లో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టూరిజం నోడల్ అధికారిణి అనూష లక్ష్మీదేవిపల్లి మండలం కారుకొండ రామవరం బౌద్ధ రాతి గుహలను సందర్శించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేసి పర్యాటకుల రద్దీని పెంచడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని, దీని ద్వారా స్థానిక గ్రామ పంచాయతీలకు ఆదాయాన్ని పెంచడంతో పాటు వివిధ సేవల ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించడమే తమ విధానమని తెలిపారు.కారుకొండ బౌద్ధ గుహలు చారిత్రక ప్రాధాన్యత కలిగిన ప్రదేశమని, ఇక్కడికి వచ్చే పర్యాటకులకు మెరుగైన సౌకర్యాలు, గైడ్ సేవలు, పార్కింగ్, త్రాగునీరు వంటి వసతులు కల్పించడం ద్వారా జీపీ ఆదాయం పెరిగేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు.జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పర్యాటక ప్రాంతాలను గుర్తించి, వాటి అభివృద్ధికి ప్రతిపాదనలు ప్రభుత్వానికి నివేదించనున్నట్లు తెలిపారు.

# యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండండి పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

- అంతర్జాతీయ పర్వతారోహకుడు లెంకల మహిపాల్ రెడ్డి మరో అరుదైన ఘనత సాధించారు.
- పర్వత శిఖరంపై “ సే నో టూ డ్రగ్స్ ” అనే బ్యానర్ ప్రదర్శన

ప్రజాదివాస్

పెద్దపల్లి జిల్లా కలెక్టర్ శ్రీ కోయ శ్రీ హర్ష ఆలోచన మేరకు నిర్వహిస్తున్న యువశక్తి కార్యక్రమంలో భాగంగా యువతను మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంచడంతో పాటు, తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖలో కానిస్టేబుల్, ఎస్సై ఉద్యోగాలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఉచిత శిక్షణ అందిస్తున్నారు. యువత పెద్ద సంఖ్యలో యూనిఫాం సర్వీసుల్లోకి వెళ్లేలా ప్రోత్సహించాలనే దృఢ సంకల్పంతో ఈ కార్యక్రమం కొనసాగుతోంది ఈ సందర్భంగా అంతర్జాతీయ పర్వతారోహకుడు లెంకల మహిపాల్ రెడ్డి సముద్ర మట్టానికి సుమారు 5,819 మీటర్ల ఎత్తులో ఉన్న రుద్రగైర పర్వత శిఖరాన్ని విజయవంతంగా అధిరోహించారు.ఈ




నెల 4వ తేదీన ప్రారంభమైన ఈ పర్వతారోహణ యాత్రలో భాగంగా, సెప్టెంబర్ 5వ తేదీన గంగోత్రి నుంచి భారతదేశానికి చెందిన తొమ్మిది మంది పర్వతారోహకులతో కలిసి ఆయన ప్రయాణం ప్రారంభించారు. సెప్టెంబర్ 9వ తేదీ అర్ధరాత్రి 12 గంటలకు సమిట్ క్యాంప్ నుంచి బయలుదేరిన లెంకల మహిపాల్ రెడ్డి, ప్రతికూల పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కొంటూ రుద్రగైర పర్వత శిఖరాన్ని విజయవంతంగా అధిరోహించారు.ఈ సందర్భంగా పర్వత శిఖరంపై “సే నో టూ డ్రగ్స్ ” అనే బ్యానర్‌ను ప్రదర్శించారు. యువత మత్తు పదార్థాలకు, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలనే బలమైన సందేశాన్ని సమాజానికి అందించాలనే ఉద్దేశంతో ఈ బ్యానర్‌ను పర్వత శిఖరంపై ఆవిష్కరించారు.ఈ సందేశాన్ని మరింత బలంగా యువతలోకి తీసుకెళ్లాలనే ఉద్దేశంతోనే మహిపాల్ రెడ్డి రుద్రగైర పర్వత శిఖరంపై “సే నో టూ డ్రగ్స్ ” బ్యానర్‌ను ప్రదర్శించారు.ఇదివరకే ఎన్నో పర్వతాలను విజయవంతంగా అధిరోహించిన లెంకల మహిపాల్ రెడ్డి, తాను అధిరోహించే ప్రతి పర్వత శిఖరంపై మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా అవగాహన కల్పించే బ్యానర్లను ప్రదర్శిస్తూ వస్తున్నారు. యువత మత్తు పదార్థాలకు లోనుకాకుండా, ఆరోగ్యకరమైన, లక్ష్యసాధనతో కూడిన జీవితాన్ని ఎంచుకోవాలనే సందేశాన్ని తన పర్వతారోహణల ద్వారా అందిస్తున్నారు.రుద్రగైర పర్వత శిఖరంపై “సే నో టూ డ్రగ్స్ ” బ్యానర్‌ను ప్రదర్శించడం ద్వారా లెంకల మహిపాల్ రెడ్డి మరోసారి తన సాహసంతో పాటు యువతలో సామాజిక చైతన్యం తీసుకురావాలనే తన సంకల్పాన్ని చాటిచెప్పారు.

# 14వ వార్డులో తాగునీటి సమస్యకు చెక్

ప్రజాదివాస్



ఏళ్ల నాటి నీటి కష్టాలకు ఉదయ జ్యోతి చెక్.. 14వ వార్డులో తాగునీటి సమస్యకు పరిష్కారం ప్రజల గోడు విన్న వెంటనే స్పందన.. మాట ఇచ్చి నీరు తెచ్చిన కౌన్సిలర్ ఉదయ జ్యోతి సమస్య తెలిసిన వెంటనే రంగంలోకి.. అధికారులతో సమన్వయం చేసి పరిష్కారం చూపిన ఉదయ జ్యోతి: అశ్వారావుపేట మున్సిపాలిటీ 14వ వార్డులో ఏళ్లుగా కాలనీ వాసులను వేధిస్తున్న తాగునీటి సమస్యకు కౌన్సిలర్ డాక్టర్ ఉదయ జ్యోతి ప్రత్యేక చొరవతో ఎట్టకేలకు పరిష్కారం లభించింది. నీటి కోసం ప్రజలు పడుతున్న ఇబ్బందులను తెలుసుకున్న ఆమె.. సమస్య పరిష్కారం అయ్యే వరకు అధికారులతో సమన్వయం చేస్తూ ప్రత్యేక శ్రద్ధ చూపారు.తాగునీటి సమస్యను మున్సిపల్ కమిషనర్ తూటి దిలీప్ రెడ్డి, వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ బాబు దృష్టికి తీసుకెళ్లి, వెంటనే చర్యలు చేపట్టేలా కృషి చేశారు. దీంతో తక్కువ సమయంలోనే సమస్య పరిష్కారం కావడంతో కాలనీ వాసుల్లో ఆనందం వ్యక్తమైంది.ప్రజల సమస్యను గుర్తించడం మాత్రమే కాకుండా.. పరిష్కారం చూపించే వరకు పట్టువదలకుండా కృషి చేసిన కౌన్సిలర్ ఉదయ జ్యోతిపై కాలనీ వాసులు ప్రశంసలు కురిపించారు.